# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, మే 30, 2025 | సంపుటి - 20 | సంచిక 140 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## గద్దర్ అవార్డుల ప్రకటన




12లో

- ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ
- ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
- ఉత్తమ నటిగా నివేదా థామస్
- ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్
- అవార్డుల వివరాలు ప్రకటించిన జయసుధ, దిల్‌రాజ్

గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ-.. విజేతలను ఎంపిక చేసింది.

## ఫోన్ ట్యాప్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

- మూడ్రోజుల్లో ఇండియాకు రావాల్సిందే
- మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావుకు ఆదేశం




న్యూఢిల్లీ : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఐపీఎస్ అధికారి, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంలో కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు.. 2లో

## నిరుద్యోగులకు బాసటగా రాజీవ్ యువవికాస్

### సమీక్ష సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్ : భూభారతి, రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సన్నద్ధత పై అధికారులకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం భవనంలోని వీసీ హాల్ నందు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి ఇందిరమ్మ కీలక అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసంగి లో వరి ధాన్యం సేకరణ, త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ కు సన్నద్ధత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, భూ భారతి చట్టం అమలు తీరు, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలతో పాటు వాటిలోని లోటుపాట్లను శాసనసభ్యులు సూచించగా వాటిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 2లో



## వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

- రాష్ట్రంలో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది
- ఇటీవలి అల్లర్లలో గుండాలకు స్వేచ్ఛ
- ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా
- ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు
- బెంగాల్ ర్యాలీలో మమతపై విరుకుపడ్డ మోడీ

కోల్‌కతా : ప్రస్తుతం బెంగాల్ రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. 2లో

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

- ధరణి కష్టాలు రిపీట్ కాకుండా భూమాత
- భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

ఖమ్మం : జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు- జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే 2లో





## ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

- రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి..సేకరణ
- ధాన్యం సేకరణలో భద్రాద్రి, ఖమ్మం రికార్డు
- ఎప్పుడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షలు
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి

ఖమ్మం : అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. 2లో






## కల్వకుంట్ల కుటుంబలో రాజకీయ తుఫాన్

- ముదిరి పాకాన పడ్డ కెసిఆర్ కుటుంబ రాజకీయాలు
- బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసే కుట్రలు
- తనపై లేనిపోని కథనాలు..పెయిడ్ ఆర్టికల్స్
- కొందరు నేతలు పనిగట్టుకుని విమర్శలు
- కెసిఆర్ మాత్రమే మా నాయకుడు
- కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం
- కెసిఆర్‌కు నోటీసులు వచ్చినా స్పందించని నేతలు
- కావాలనే నిజామబాద్‌లో నన్ను ఓడించారు
- నా జోలికి వస్తే...నేనసలే మంచిదాన్ని కాదు
- కెటిఆర్ లక్ష్యంగా నిప్పులు చెరిగిన సోదరి కవిత

కెసిఆర్ కుటుంబ రాజకీయం ముదరి పాకాన పడింది. రాజీకయ తుఫాన్ చెలరేగింది. తీవ్ర వాయుగుండంగా మారింది. తీరం ఎక్కడ ఎలా దాటుతుందో కానీ..అలజడి సృష్టిస్తోంది. గాలిబుడగలా ఉన్న ఐక్యత పేలింది. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ హైజాక్ చేసి గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై సోదరి కవిత బాంబు పేల్చారు.




హైదరాబాద్ : కెసిఆర్ నాయకత్వం తప్ప ఎవరి నాయకత్వాన్ని అంగీకరించేది లేదని సోదరుడు కెటిఆర్‌కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీని ఇష్టారీతిన నడుపుతూ...బిజెపికి గొడుగు కిందకు చేరుస్తున్నారంటూ మండిపడ్డారు. వందిమాగధులతో విమర్శలు చేయిస్త ఊరుకునేది లేదని ఘాటు హెచ్చరికలు చేశారు. తనను సవాల్చేయాలనకుంటే ఉఫ్‌న ఊదేస్తానని హెచ్చరించారు. ట్విట్టర్ రాజకీయాలను సహించేది లేదని తేల్చారు. మొత్తంగా అన్న కెటిఆర్‌పై కవిత యుద్ధం ప్రకటించారు. పట్టుతప్పుతున్న పార్టీని కాపాడు కోవడమే తన లక్ష్యమని 2లో

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం

### టీయూడబ్ల్యూజే వినతికి స్పందించిన మంత్రులు

హైదరాబాద్ : ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ముగ్గురు క్యాబినెట్ మంత్రులు హామీ ఇచ్చారు. ఈరోజు కరీంనగర్ లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి ,శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లకు టీయూడబ్ల్యూజే హెచ్ 143 కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తప్పకుండా త్వరలోనే జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మిగతా 2లో



## ప్యాకేజీ లభిస్తే..బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం

- ఇలాంటి రాజకీయాలతోనే బిజెపి నష్టపోతోంది
- లేకుంటే ఎప్పుడో అధికారంలోకి వచ్చేది
- కవిత వ్యాఖ్యల నేపథ్యంలో రాజాసింగ్ సంచలన కామెంట్స్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్ని స్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయ త్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు. మిగతా 2లో

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ స్కీం,బిపిఎల్ కింద కరీంనగర్ లోని జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ఎస్సారెస్పీకి చెందినవి కావడంతో ఎన్ఓసి సమస్యతో సహా ఇతర ఇబ్బందుల కారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అలాగే గతంలో స్థలాలు పొందని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తమ వినతి పత్రంలో మంత్రులను కోరారు. సమాజంలో సత్యాన్ని వెలికి తీసే జర్నలిస్టులు తమ కుటుంబాలకు స్థిరమైన గృహం కోసం ఎదురుచూస్తున్నారని, మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే నాయకులు రిషికేష్, తదితరులు పాల్గొన్నారు

## వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

గురువారం పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌దువార్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇండియా... విక్షిత్ భారత్‌గా మారాలంటే.. పశ్చిమ బెంగాల్‌ను కూడా విక్షిత్ పశ్చిమ బెంగాల్‌గా మార్చడం ముఖ్యమని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు కొత్త శక్తిని నింపాల్సిన అవసరం ఉందని.. జ్ఞానం.. విజ్ఞాన కేంద్రంగా 'మేక్ ఇన్ ఇండియా' కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జికి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ- ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదని మోదీ దుయ్యబట్టారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.

## ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి.పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారులతో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంఛార్జ్ మంత్రులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుంటున్నారు.. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది.. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్లలో జమ,ఏశాం.. గతంలో 2, 3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు అని ఆరోపించారు. దీనికి అధికారులకు అభినందనలు.. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి.. దేశంలో ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం.. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు.. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే, సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి.. నకిలీ విత్తనాలు అమ్మేవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు అని ఉప ముఖ్యమంత్రి భట్టి వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. ఇక, ధరణి పోర్టల్ ను పదేళ్లు చూశాం.. ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ధరణిని తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టు-గానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారు.. అందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం పేదలకు అనుకూలంగా ఇది పని చేస్తుందని డిప్యూటీ- సీఎం విక్రమార్క పేర్కొన్నారు. ఇక, తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి అన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి.. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంఛార్జ్ మంత్రికి అప్పగించాలి అని సూచించారు. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పర్చొద్దు.. గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది.. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదు, పూర్తి స్థాయిగా నిధులు విడుదల చేస్తామన్నారు. సీజన్ వ్యాధులకు సంబంధించి కలెక్టర్లు సీరియస్ గా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. తాగునీరు లీకేజీలపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. గతంలో ప్రభుత్వాలు విభాగాలను గాలికి వదిలేశాయి. కానీ ప్రస్తుతం బడ్జెట్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు, నిధులు విడుదల చేస్తాం అన్నారు. పదేళ్లు వెనుకపడ్డాం. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు. లక్ష్యాలను చేరుకోవాలంటే ఇదే మార్గం అంటూ భట్టి స్పష్టమైన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు బాసటగా రాజీవ్ యువ వికాస్

రాజీవ్ యువ వికాసం పై పలువురు శాసన సభ్యులు బ్యాంకు స్కోరింగ్ లో ఇబ్బందులు పెడుతున్నందున అట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి ఇట్టి విషయాన్ని తీసుకెళ్లి రాజీవ్ వికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలు అయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని జూన్ మూడో తేదీ నుండి అన్ని మండలాల్లో విజయవంతంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి కలెక్టర్లకు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తూ అవగాహన కల్పిస్తూ సూచనలు సలహాలు అందజేయాలని అధికారులకు సూచించారు. రాజు యువ వికాసంలో ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యత ఉన్న యూనిట్లను ఎంపిక చేసి వారికి సరైన అవకాశం కల్పించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు ప్రభుత్వ భూములు ఎక్కడైనా ఆక్రములకు గురైతే అటు విలువైన భూములను కాపాడాలని మంత్రి అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పై మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 17,440 ఇండ్లకు అలాట్మెంట్ ఇవ్వగా అందులో 16,617 ఇండ్లకు మంజూరు ఇవ్వడం జరిగిందని, 4 వేల 84 ఇండ్ల గ్రౌండింగ్ ఇప్పటికే పూర్తయిందని వచ్చే వారంలో పదివేల ఇండ్లు ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు కాల యాదయ్య ఆర్కెపూడి గాంధీ కసిరెడ్డి నారాయణరెడ్డి వీలపల్లి శంకర్ మనోహర్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్యాకేజీ లభిస్తే..బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం

ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కై-పోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగిందని రాజాసింగ్ అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆయన వాపోయారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని అనుకుంటే ఎక్కడి నుంచి నిలబడాలి అనేది కూడా బీఆర్ఎస్ వాళ్లే డిసైడ్ చేస్తారన్నారు. గతంలో కూడా ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని అన్నారు. ప్రతీ ఎన్నికల్లో తమ పార్టీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీని వల్ల బీజేపీ చాలా నష్టపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ విషయం తెలుసని.. అయినా ఎవరూ బయటపడరన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకు వెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో కార్యకర్తలు, అధికారులు నోరు మూసుకుని కూర్చున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ లేఖను విడుదల చేశారు. అయితే సొంత పార్టీపై విమర్శలు చేయడం రాజాసింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కూడా బీజేపీపై పలు విమర్శలు చేశారు. పదేళ్ల పాటు- బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పూర్తి స్థాయిలో అధికారపార్టీకి తొత్తులుగా మారేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో చేతులు కలుపుతూ వారికి వంత పాడటం అనేది బీజేపీ రాష్ట్ర నాయకుల్లో కొంతమందికి అలావాటు- అయ్యిందని, పాత స్కాబ్‌ను తీసివేస్తే తప్ప పరిష్కారం లభించదంటూ గతంలో కూడా రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే.

## కల్వకుంట్ల కుటుంబలో రాజకీయ తుఫాన్

చెప్పకనే చెప్పారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కవిత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారంటూ మండిపడ్డారు.బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడే కుట్ర మొదలైందన్నారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తారా అని పరోక్షంగా కెటిఆర్ మండిపడ్డారు. జైలుకు వెళ్లేటప్పుడే పార్టీకి రాజీనామా చేస్తానన్నానని తెలిపానని అన్నారు. పార్టీ సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేశారని, తన లేఖ లీక్ చేసిందెవరో చెప్పాల్సిందేనని మండిపడ్డారు. లీకు వీరులను పట్టుకోమంటే, గ్రీకువీరులు దండెత్తారని మండిపడ్డారు. తన జోలికి వస్తే బాగుండదని అంటూనే తానసలే మంచిదానిని కాదన్నారు. కేసీఆర్‌ను తామే నడిపిస్తున్నామని చెప్పుకుంటున్నారని, కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లా మీరు..అని ప్రశ్నించారు. తనపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు వస్తే ఎందుకు నిరసనలు తెలపలేదని, ఇంకో నేతకు నోటీసులు వస్తే ఎందుకు హంగామా చేశారని ప్రశ్నించారు. తాను వాళ్లలా చిల్లర రాజకీయాలు చేయనని, హుందాగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరపున చేస్తున్నానని, కోవర్టులు ఉన్నప్పుడు ఎందుకు పక్కన పెట్టడం లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాయకుడని, పార్టీలో ఇంకెవరి నాయకత్వాన్ని అంగీకరించనని నిర్మొహ మాటంగా తేల్చేసారు. మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తన అన్న కెటిఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ ఆమె ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని నిలదీశారు. పెయిడ్ ఆర్టిస్టులతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో రాయబారాలు జరిపే అవసరం తనకు లేదన్నారు. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందన్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. పార్టీని బీజేపీలో కలపాలని చూస్తున్నారు. బీజేపీలో విలీనం చేయొద్దని చెప్పాను. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై.. నేను జైల్లో ఉన్నప్పుడే అడిగితే చెప్పాను. 101 శాతం బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఉంటే బీజేపీలో కలపడం కుదరదని.. అందుకే నన్ను కేసీఆర్‌కు దూరం చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న కుట్రలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లోనే ఉన్న కొందరు కోవర్టులు నన్ను ఓడించేందుకు ప్రయత్నించారని, పేయిడ్ న్యూస్‌లు వేసి, లేఖల్ని లీక్ చేసి, బీజేపీలోకి బీఆర్ఎస్‌ను కలిపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండాలంటే ట్వీట్లు- చేయడం మాత్రమే కాదు, కార్యాచరణ చూపించాలి. పార్టీ నడిపించే సత్తా మీకు లేదని నన్ను తప్పుబడుతున్నవారు ముందుగా వాళ్లు ఏం చేశారో చెప్పాలని అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు.తమపై కుట్రలు జరుగుతున్నాయని, తనను బీఆర్ఎస్ నుంచి బయటకు నెట్టాలని ప్రయత్నాలు జరుగు తున్నాయని కవిత ఆరోపించారు. నాకు ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నాడు..ఆయన కేసీఆర్. కొత్త పార్టీలు ఎందుకు..ఉన్న బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను కాపాడితే చాలు. తెలంగాణ జాగృతి ద్వారా నేను పార్టీకి, రాష్ట్రానికి సేవ చేస్తున్నా,అని స్పష్టం చేశారు. నేను పదవులు అడిగినవాళ్లలోని కాదు. కేసీఆర్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో పని చేస్తున్నా. నా కడుపులో బిడ్డ ఉన్నప్పుడు కూడా తెలంగాణ కోసం పోరాడిన నేను.మామూలు నాయకురాలు కాదు. నాతో పెట్టుకుంటే తీపిగా ఉండదని ఇప్పటికైనా గ్రహించాలి,అంటూ కవిత మరోసారి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ నేతలకు చెందిన హాస్పిటల్స్ ప్రారంభోత్సవాలకు వెళ్ళింది ఎవరో అందరకీ తెలుసునంటూ పార్టీలోని అగ్రనేతలను ఆమె పరోక్షంగా విమర్శించారు. తన లేఖ లీక్ చేసిందెవరు తేల్చమంటే.. తనపై పడి ఏడుస్తున్నారంటూ మండిపడ్డారు. పదవులు కోరినట్లు తనపై పత్రికల్లో తప్పుడు వార్తలు రాయించారన్నారు. కేసీఆర్ లెక్క.. తాను చాలా తిక్కదానినని ఆమె పునరుద్ఘాటించారు. వెన్నుపోటు రాజకీయాలు తనకు రావని.. సూటిగా మాట్లాడుతానని కుండ బద్దలు కొట్టారు. సామాజిక తెలంగాణ సాధన కోసం తాను పోరాడుతానన్నారు. మావాళ్ళు కొందరు..సోషల్ మీడియాలో మహాభారతం క్యారెక్టర్లు వేస్తున్నారంటూ వ్యంగ్యంగా అన్నారు. వారు స్థాయికి మించి ఊహించుకుంటు న్నారంటూ ఎద్దేవా చేశారు. వరంగల్ సభ తమ వలనే సక్సెస్ అయిందని కొందరు ఊహించు కుంటున్నారన్నారు. కేసీఆర్‌ను మోసేంత పెద్ద వాళ్ళు అయిపోయామని వారంతా భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిజామాబాద్ ఎంపీగా తనను ఓడించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా ఉండగా చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఏమి చేసినా.. కేంద్రం అడ్డుకోవటం లేదని ఒకింత అసహనాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇప్పటికీ గోదావరి నదీ జలాలు పంపకం సరిగా జరగలేదన్నారు. ఏపీ చేపట్టనున్న బనకచర్ల ప్రాజక్టుతో తెలంగాణకు తీరని నష్టం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే తన నాయకుడని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ తప్ప.. ఇతర నేతల నాయకత్వంలో తాను పనిచేయనని కుండ బద్దలు కొట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న వారిని గౌరవిస్తానని కవిత పేర్కొన్నారు.

## పాక్‌తో యుద్ధం అర్ధంతరంగా ఎందుకు ఆపారు

యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తుచేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేశారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. పీవోకేను స్వాధీనం చేసుకోవాలని మోదీతో తాము చెప్పామని అన్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించినందుకా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు- పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకువచ్చానని గుర్తుచేసుకున్నారు. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికలు, ఓట్ల కోసం కాదు..సైనికుల ఆత్మ స్థైర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాప్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

ముందస్తు బెయిల్ కోసం సుప్రీంలో పిటిషన్ వేయగా.. గురువారం విచారణ జరిగింది. ప్రభాకర్ రావుకు తాత్కాలిక ముందస్తు బెయిల్‌ను సుప్రీం కోర్టు మంజూరు చేసింది. అలాగే ఇండియా వచ్చేందుకు పాస్ పోర్ట్‌ను కూడా సుప్రీం ధర్మాసనం మంజూరు చేసింది. మూడు రోజుల్లో ఇండియా రావాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విచారణకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావుకు న్యాయస్థానం ఆదేశించింది. మూడు రోజుల్లో ఇండియా వచ్చి దర్యాప్తునకు సహకరిస్తా అని వెంటనే అండర్ టేకింగ్ ఇవ్వాలని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశించింది. ఇప్పటికిప్పుడు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటి కేసుల్లో ముందస్తు బెయిల్ అంశంపై తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాగా.. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ గతంలోనే తెలంగాణ కోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ ఇస్తే ఇండియాకు తిరిగి వస్తానని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ప్రభాకర్ రావుకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో మే 9న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు ప్రభాకర్ రావు. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే భారత్‌కు తిరిగి వస్తానని పిటిషన్‌లో వెల్లడించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారించిన సుప్రీం ధర్మాసనం.. ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో పాటు- వెంటనే ఇండియాకు తిరిగి రావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. . తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ అమెరికాలో ప్రభాకర్ రావు పిటిషన్ వేయగా.. అందుకు అమెరికా ప్రభుత్వం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు జూన్ 20 లోపు కోర్టులో హాజరుకావాలని లేదంటే ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామంటూ నాంపల్లి కోర్టు ఇటీ-వల స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు ఇంటి గోడకు పోలీసులు నోటీ-సులు కూడా అంటించారు. ఇలా ప్రకటిస్తే ప్రభాకర్ రావు ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం దర్యాప్తు సంస్థకు ఉంటు-ంది.

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు- కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాలలో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని.. పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేదు... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఎ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

## ఢిల్లీకి చేరిన మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు

### మంత్రివర్గంలో చోటు కోసం డిమాండ్

న్యూఢిల్లీ : తెలంగాణ కేబినెట్ విస్తరణ వివాదం ఢిల్లీకిచేరింది. కేబినేట్‌లో తమకు అవకాశం ఇవ్వాలని మాదిగ సామాజికవర్గం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో నలుగురు తెలంగాణ కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు మకాం వేశారు. అడ్లూరు లక్ష్మణ్, మందుల సామెల్, కవ్వం పల్లి సత్యనారాయణ, లక్ష్మీ కాంతారావు ఢిల్లీకి వెళ్లారు. వీరు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వీరు కలువనున్నారు. మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను ఈ నలుగురు ఎమ్మెల్యేలు కోరనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం గురించి సీఎం, పీసీసీ, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌కు తెలిపే ఢిల్లీ వచ్చామన్నారు. తమ న్యాయమైన డిమాండ్ అన్నారు. మాదిగ కులస్తునికి ఖచ్చితంగా కేబినెట్‌లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగ సామాజికవర్గం పెద్ద సామాజిక వర్గమన్నారు. తమ సామాజిక వర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గ ప్రతినిధి ఉండాలన్నారు. మాదిగ వర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉందని తెలిపారు. మాలలకు మంత్రివర్గంలో స్థానం కల్పించడం పట్ల తమకు అభ్యంతరం లేదని చెప్పారు. మంత్రివర్గంలో ఎవరుండాలనేది నిర్ణయించేది అధిష్టానం కాబట్టి ఢిల్లీ వచ్చామ న్నారు. మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి కచ్చితంగా స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. మొదటి కేబినెట్ ఏర్పాటు-లోనే తమకు అవకాశం దక్కుతుందని భావించామని.. ఇప్పుడు రెండోసారి కేబినెట్ విస్తరణ జరుగుతుంది కాబట్టి ఇప్పుడు మరోసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గంలో ఏ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# ప్రధాని వ్యాఖ్యలపై మమతా బెనర్జీ ఫైర్

### టీవీ చర్చకు సిద్ధమేనా అంటూ సవాల్

### బెంగాల్‌పై కోసాధింపు చర్యలు తగవని హితవు



కోల్‌కతా : ప్రధాని మోడీ-పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. గురువారం ప్రధాని మోడీ పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వమే లక్ష్యంగా మోడీ విమర్శలు గుప్పించారు. మమతను ఉద్దేశించి 'నిర్మత' అనే మాటను ఉపయోగించారు. హిందీలో క్రూరత్వం అని అర్థం వచ్చే విధంగా 'నిర్మత' అనే మాటను ప్రధాని మోడీ ఉపయోగించారు. మమత శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమైందని.. పౌరుల భద్రతను విస్మరించిందని ఆరోపించారు. గత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ముర్షిదాబాద్, హల్దాలో హింస చెలరేగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లను దృష్టిలో పెట్టుకుని మోడీ విమర్శలు గుప్పించారు. మోడీ విమర్శలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. 'ఆపరేషన్ సిందూర్' మాదిరిగా 'ఆపరేషన్ బెంగాల్' చేస్తామని మోడీ వ్యాఖ్యానించడంపై ధ్వజమెత్తింది. ఈ వ్యాఖ్య బెంగాల్ ప్రజలను అవమానించడమేనన్నారు. ప్రతిపక్షం కేంద్రానికి మద్దతుగా విదేశాల్లో అంతర్జాతీయ వేదికలపై ఆపరేషన్ సిందూర్ గురించి టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ గొంతు వినిపిస్తుంటే.. మోడీ మాత్రం రాజకీయ హోలీ ఆడుతున్నారని మండిపడ్డారు. అంతర్జాతీయ వేదికపై కేంద్రాన్ని సమర్థిస్తుంటే మోడీ మాత్రం.. బెంగాల్‌ను కించపరచడానికి ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు జరుగుతున్నాయో తెలియదా? అని ప్రశ్నించారు. మోడీ.. బెంగాల్ మహిళలను అగౌరవపరిచారని.. తాము మాత్రం ప్రతి ఒక్కరినీ గౌరవిస్తామని.. కానీ ఆత్మగౌరవాన్ని పణంగా మాత్రం పెట్టమని చెప్పారు. 'ఆపరేషన్ బెంగాల్' అని చెప్పడానికి మోడీకి ఎంత ధైర్యం ఉండాలి? అదే జరిగితే రేపే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు నిర్వహించండి.. అందుకు సిద్ధంగా ఉన్నట్లు- మమత ప్రకటించారు. ఇక బెంగాల్ సమస్యలపై లైవ్ టీవీ చర్చకు మోడీ సిద్ధమా? అని మమత సవాల్ విసిరారు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం రాజకీయ నాటకాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. గురువారం మోడీ ప్రసంగాన్ని విని షాక్ అయినట్లు- చెప్పుకొచ్చారు. అలాంటి మాటలు వినాల్సి రావడం దురదృష్టకరం అన్నారు. కేవలం రాజకీయ మైలేజ్ కోసమే కేంద్రం ఆపరేషన్ సిందూర్ కోడ్ నేమ్ ఉపయోగిస్తోందని ఆరోపించారు.

# బిఆర్ఎస్‌లో దయ్యాలను పెంచి పోషించిన కెసిఆర్

### పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు

### మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

కామారెడ్డి : ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. కేసీఆర్ దేవుడు.. కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న కవిత కామెంట్స్‌పై ఆయన రియాక్ట్ అయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని.. ఆయన కూతురు కవిత చెప్పిన దాంట్లో అబద్ధం ఏమి లేదు. బీఆర్ఎస్లో ఆ దెయ్యాలను పెంచి పోషించింది స్వయంగా కేసీఆరేనని జూపల్లి హాట్ కామెంట్స్ చేశారు. గురువారం కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. గత పదేళ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన అప్పులకు ప్రతి నెల మా ప్రభుత్వం వడ్డీ కడుతోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ ఆగం చేసిన.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మా ప్రభుత్వం పథకాలను ఆపకుండా నిరంతరంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. కానీ అమెరికా మాట విని మధ్యలోనే ఆపరేషన్ సిందూర్ ఆపడం సరికాదని అన్నారు. ఇందిరాగాంధీ ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపారని.. ఆమె హయాంలో పాక్‌తో యుద్ధం ఆపడానికి అమెరికా రాయబారం చేస్తే అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని అగ్రరాజ్యానికి తేల్చి చెప్పారని గుర్తు చేశారు. ఇక, తెలంగాణలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 70, 80 శాతం సీట్లు- కైవసం చేసుకోవాలని సూచించారు.

# భారత్ బ్రహ్మోస్‌తో దెబ్బతిన్నాం

### ఎయిర్‌బేస్‌లు ధ్వంసం అయింది నిజమే

### మరోమారు అంగీకరించిన పాక్ ప్రధాని

న్యూఢిల్లీ : భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇండియన్ ఆర్మీ ధైర్య సాహసాలు, తిరుగులేని వ్యూహాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇండియన్ ఆర్మీ మిస్సైల్స్ దాడులపై తాజాగా, పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమను ఊహించని దెబ్బ కొట్టిందని అన్నారు. మే 10వ తేదీన తమ ఆర్మీ భారత్‌పై దాడి చేయడానికి అంతా సిద్ధం చేసుకుందని, ఈలోపే భారత్ బ్రహ్మోస్ మిస్సైల్స్‌తో దాడి చేసిందని తెలిపారు. కీలక మిలటరీ బేస్‌లతో పాటు- ఎయిర్‌పోర్టుపై దాడి చేసిందన్నారు. పాకిస్తాన్ మిత్ర దేశం అజర్‌బైజాన్‌లో పర్యటిస్తున్న షహబాజ్ షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అజర్‌బైజాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షరీఫ్ మాట్లాడుతూ.. ' మే 10వ తేదీ ఇండియాపై దాడులు చేయడానికి ఎ÷-లాన్ చేశాం. పాకిస్తాన్ ఆర్మీ దాడులు చేయడానికి అంతా సిద్ధం చేసుకుంది. ప్రార్థనలు పూర్తయిన తర్వాత .. తెల్లవారుజామున 4.30 గంటలకు దాడి చేద్దామని అనుకున్నాం. పాకిస్తాన్ దాడి చేయడానికి ముందే ఇండియా దాడులు మొదలెట్టింది. పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల్లో లాంగ్ రేంజ్ సూపర్ సోనిక్ బ్రహ్మోస్ క్రూయిజ్ మిస్సైల్స్‌తో దాడులు చేసింది. రావల్పిండిలోని ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేసిందని అన్నారు.

# అడ్డదారుల్లో బంగ్లా శరణార్థులు

### ఆధార్ కార్డులు సహా సకల సౌకర్యాలు

### నేరాలుచేస్తూ ఇక్కడే ఉండేలా నైజీరియన్లు

### హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్ : హైదరాబాదులో నేరాలు చేస్తున్న నైజీరియన్స్‌ను డిపోర్ట్ చేస్తున్నట్లు- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డిపోర్టు చేసిన తర్వాత కూడా చాలా మంది నకిలీ పాస్‌పోర్ట్ లతో ఇండియాలోకి ప్రవేశిస్తున్నారని, అలాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేస్తున్నట్లు- వెల్లడించారు. హైదరాబాద్ లో జోనల్ సైబర్ సెల్స్ ను ప్రారంభించిన కార్యక్రమంలో ప్రసంగించారు. నైజీరియన్లను వాళ్ళ దేశానికి డిపోర్ట్ చేస్తారని భయంతో ఏదో ఒక కేసులో ఇన్వాల్వ్ అవుతున్నారని సంచలన విషయాన్ని తెలిపారు. చివరికి 498 కేసులో అయిన ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టించు కుంటున్నారని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. నైజీరియన్స్ పై కేసు నమోదు అయితే చట్టపరంగా డిపోర్ట్ చేయలేమని స్పష్టం చేశారు. వారిపై కేసు ట్రయల్ పూర్తి చేసి క్లోజ్ అయ్యే వరకు డిపోర్టు చేయలేమని వివరించారు. బంగ్లాదేశ్ కి చెందిన పౌరులు కూడా శరణార్థులుగా ఇక్కడికి వస్తున్నారని.. ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు- తెలిపారు. అడ్డదారుల్లో ఇక్కడ ఆధార్ పొందుతున్నట్లు- గుర్తించినట్లు- చెప్పారు. ఈ వ్యవహారంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. ఉగ్రవాద లింక్స్ ఉన్న సమీర్ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని సీపీ స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఎన్ఐఏ నాలుగు చోట్ల సోదాలు చేసిందని.. ఎన్ఐఏ విచారణ, సోదాలకు హైదరాబాద్ పోలీసుల సహకారం అడిగితే చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లో సమీర్ తో ఇంకా ఎవరెవరికి లింక్స్ ఉన్నాయనే అంశాన్ని ఎన్ఐఏ దర్యాప్తులో బయటికి వస్తాయని తెలిపారు. అలాగే.. ఫోన్ టాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని సీవీ ఆనంద్ వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని..ప్రస్తుతానికి ఉన్న చర్యలు అన్ని హోల్డింగ్ లోకి వెళ్లిపోతాయన్నారు. కొత్త పాస్‌పోర్టు జారీ పక్రియ మొత్తం కూడా విదేశీ వ్యవహారాల శాఖ చూసుకుంటుందని.. పాస్‌పోర్టు ఎప్పుడు ఎలా జారీ చేస్తారనే విషయాన్ని తాము కూడా తెలుసుకోవాలన్నారు. ఇంటర్‌పోల్, డిస్పోర్ట్ ఇతర ఇతర చర్యలు అన్ని కూడా హోల్డింగ్ లోకి పోతాయని వెల్లడించారు.

# కార్పోరేట్ గుప్పిట్లో ఆర్థిక వ్యవస్థ

### మాంద్యం నుంచి బయటపడే మార్గమేది?

న్యూఢిలీ : మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయన్న విమర్శలు ఉన్నాయి. నిజానికి దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోతోంది. తాజా అధ్యయనా మేరకు ధరాఘాతం పేదలను మరింత పేదలుగా మారుస్తోంది. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. కొన్ని కార్పోరేట్ శక్తుల చేతుల్లోనే ఆర్థిక చక్రం ఇమిడి ఉంది. వారు చెప్పినట్లుగానే దేశీయ ఆర్థిక విధానాలు సాగుతున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా ఉండేలా విధానాలు రూపకల్పన చేస్తున్నారు. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్న విమర్శలు బలపడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ధరల పెరుగుదల తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. దేశం నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని చెప్పుకోవడం తప్ప ఎక్కడా దాని ఫలితం కానరావడం లేదు. డాలర్ మారకం రేటు అంతకంతకూ పెరుగుతోంది. పెట్టుబడుల వృద్ధిరేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు. చైనాలాంటి దేశాలు ఆర్థిక కట్టుబాట్లను అవలంబిస్తోంది. దేశంలోని అధికార పదువుల్లో ఉన్న వారి ఖర్చుల్లో కోత పెట్టారు. కానీ మనదేశంలో వారికే ఎక్కువ వెసలుబాట్లు ఉన్నాయి. అత్యధిక జీతాలు, భత్యాలు పొందుతున్న వారిలో వారే ముందు వరసలో ఉన్నారు. ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి. సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహద పడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి. దేశ స్ఫూర్తిని పరిరక్షించు కోవడానికి, భాజపా వ్యతిరేక శక్తులను ఐక్యం చేయడానికి ఇదే సరైన సమయం అంటున్న నేతలు అందుకు కార్యాచరణ గురించి చర్చించి ఉంటే బాగుండేది. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు చర్చించడం లేదు. ఓ రకంగా విపక్షాలకు కూడా సరైన ఆర్థిక విధానాలు లేవని అర్థం అవుతోంది.

# నీచ రాజకీయాలచేసే అలవాటు బిజెపికి లేదు

### పదేళ్లలో కెసిఆర్ ముంచితే..పదినెల్లో రేవంత్ ముంచాడు

### బిఆర్ఎస్ విలీనంపై తనకు తెలియదు

### కవిత మాటలను నమ్మడానికి సిద్ధంగా లేరు

### కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతా

### మీడియాతో ఈటెల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్ : నీచ రాజకీయాలు చేసే అలవాటు బిజెపికి లేదని బిజెపి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నీచ రాజీకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. తెలంగాణ వెలవెలబోతోందని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్ చేయదు. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలన్నారు. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతానని ఈటల తెలిపారు.భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో అపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా అని ఈటల ప్రశ్నించారు. ఇకపోతే కొత్తగా ఎవరు పార్టీ పెట్టినా నమ్మే పరిస్థితి లేదని ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో కలుపుతున్నారన్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు విలీనం కోసం బీఆర్ఎస్ ప్రయత్నం చేయొచ్చన్నారు.. బీజేపీ నుంచి ఎవరూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను కలుస్తానని కవిత అంటోందని.. కవిత కలిసి ఏం చేస్తదని విమర్శించారు. అందులో కొందరు చనిపోయారని.. కొందరు ఇంకెక్కడో ఉన్నారో తెలియదు, మరి కొందరు పార్టీలు మారారని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ముంచితే.. పది నెలల్లోనే రేవంత్ ముంచాడని ఎద్దేవా చేశారు. వీళ్లకు మరోసారి ఓటు వేయద్దొని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. పక్క రాష్ట్రం కేంద్ర సహకారంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఇక్కడ మాత్రం అప్పులతో ఇబ్బంది పడే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీజేపీ వస్తేనే సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కవిత విలీనం కామెంట్లపై ఈటల రాజేందర్ స్పందించారు.. గాలి వార్తలకు నేను ఏం సమాధానం చెప్పాలి.. తెలిస్తే చెబుతా కానీ, తెలియకుండా ఏం చెప్పాలి.. నేను జిమేదార్ ఉన్న రాజకీయ నాయకుడిని.. వాస్తవం ఉంటే మాట్లాడతా, లేకుండా మాట్లాడనని స్పష్టం చేశారు.

# అధికారిక ర్యాలీలో ఉగ్రదాడి సూత్రధారి

### పాక్ వార్షికోత్సవ ర్యాలీలో కనిపించిన సైఫుల్లా కసూరి

లాహోర్ : పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో దేశ అణు పరీక్షల వార్షికోత్సవ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో రాజకీయ నేతలతో కలిసి పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సైఫుల్లా కసూరీ సైతం పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సైఫుల్లా కసూరీ మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారిని తానేనంటూ భారత్ ప్రకటించిందన్నారు. ఈ విధంగా తాను ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించానని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ పేరిట భారత్ జరిపిన దాడిలో మరణించిన ముద్దస్సిర్ షాహీద్ పేరిట పంజాబ్ ప్రావిన్స్‌లోని అల్హాబాద్‌లో ఆసుపత్రులు, రహదారులను నిర్మిస్తామన్నారు. అలాగే అతడి పేరును ఒక సెంటర్‌కు పెడతామని చెప్పారు. ఇక భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో ఉన్న తల్హా సయీద్ సైతం ఈ ర్యాలీలో పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్మాడు. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ కుమారుడే ఈ తల్హా సయీద్. 2024లో ఆ దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాహోర్ ఎన్ఏ 22 స్థానం నుంచి పోటీ- చేసి ఈ తల్హా సయీద్ ఓటమి పాలయ్యాడు. అతడు పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్‌కు అనుబంధంగా కొనసాగుతున్నాడు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో గతంలో చేసుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. భారత్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ తదితర నగరాల్లో పీఎంఎంఎల్ ఆధ్వర్యంలో భారీగా ఆందోళనలు చేపట్టింది. ఈ ఆందోళనల్లో హాఫీజ్ సయీద్ సైతం పాల్గొని భారత్‌కు వ్యతిరేకంగా విమర్శలు గుప్పించిన విషయం విధితమే. ఇక అంతర్జాతీయంగానే కాదు.. పాకిస్థాన్‌లో సైతం లష్కరే తోయిబాపై నిషేధం ఉంది. 2008 ముంబై దాడులకు ఇతడే సూత్రధారి అని ఐక్యరాజ్యసమితి గతంలోనే ప్రకటించింది. అతడు ఈ పీఎంఎంఎల్ వెనుక ఉండి నడిపిస్తున్నాడనే చర్చ బలంగా సాగుతోంది.

# పాక్ గూఢచర్యలో ప్రభుత్వ ఉద్యోగి

### జైసల్మేర్‌లో షకుర్ ఖాన్ అరెస్ట్

### సంబంధాలపై పోలీసులు ఆరా

జయపుర : పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వోద్యోగి షకుర్ ఖాన్‌ను బుధవారం రాత్రి జైసల్మేర్‌లో నిఘా అధికారుల బృందం అరెస్ట్ చేసింది. షకుర్ ఖాన్‌పై గత కొన్ని వారాలుగా దర్యాప్తు బృందాలు నిఘా పెట్టాయి. పాక్ దౌత్య కార్యాలయంతో సంబంధాలు ఉన్నట్లు- అనుమానిస్తున్నారు. ఉన్నత స్థాయి సమాచారం మేరకు షకుర్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుధీర్ చౌదరి తెలిపారు. ఇక షకుర్ ఖాన్ ఫోన్‌లో పలువురి పాకిస్థానీయుల నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి గురించి సరైన సమాధానం ఇవ్వలేనట్లుగా తెలుస్తోంది. అతను పాకిస్థాన్‌కు ఏడు సార్లు వెళ్లినట్లుగా గుర్తించారు. అయితే మొబైల్స్‌లో కొన్ని ఫైల్స్ డిలీట్ అయినట్లుగా కనిపెట్టారు. అలాగే బ్యాంక్ ఖాతాలపై కూడా దృష్టి పెట్టారు. ఇటీవలే ఒక ఖాతా క్లోజ్ అయింది. దానిపై కూడా ఆరా తీస్తున్నారు. షకుర్ ఖాన్ తరచుగా మొహమ్మద్ తండ్రి ఘాజీ ఫకీర్‌ను కలిసేవాడని స్థానికులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో షకుర్ ఖాన్, మొహమ్మద్, ఘాజీ ఫకీర్ ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. ఇక 2021లో ఘాజీ ఫకీర్ మరణించారు. మే 7న ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ సరిహద్దులో జైసల్మేర్‌పై అధికారులు నిఘా పెట్టినట్లుగా పోలీసు సూపరింటెండెంట్ సుధీర్ చౌదరి తెలిపారు. సరిహద్దులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను ప్రశ్నించడానికి అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం అదుపులోకి తీసుకున్న ఏడో వ్యక్తి షకుర్ ఖాన్ అని వెల్లడించారు.

# ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డు

### ఇదొక గౌరవంగా భావిస్తున్నా : అల్లు అర్జున్

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడు(పుష్ప-2) అవార్డు దక్కింది. దీనిపై తాజాగా అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించారు. తనకు ఈ అవార్డును ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. పుష్ప-2 సినిమాకు గాను తొలిసారి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ గౌరవాన్ని నాకు కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన ఘనత అంతా మా డైరెక్టర్ సుకుమార్, ప్రొడ్యూసర్లు, మా మూవీ టీమ్ కే దక్కుతుంది. ఈ అవార్డు నా ఫ్యాన్స్ కు అంకితం చేస్తున్నాను. అభిమానులు చూపించే అవాజ్యమైన ప్రేమ, మద్దతు నాలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి' అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో పుష్ప మొదటి పార్టుకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

# లేఖలు, లీకులు కాదు..వాస్తవాలు చెప్పండి

### కవితకు ఎంపి చామల సూటి ప్రశ్న

న్యూఢిల్లీ : ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ గురించి వాస్తవాలు చెప్పాలని అనుకుంటే లేఖలు, లీకులు కాదని.. అందుకు అవసరమైన ఆధారాలు కవిత బయటపెట్టాలని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో జరిగిన అవినీతిపై కవిత దర్యాప్తు కోరాలని అన్నారు. గురువారం ఢిల్లీలో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దెయ్యాలు ఎవరో కవిత బయటపెట్టాలని.. దర్యాప్తు కోరాలని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయని తమ నేతలు మొదటి నుంచి చెబుతునే ఉన్నారని గుర్తుచేశారు.

# సంపాదకీయం

## కులమతాలే రాజకీయ ఎజెండా !

దశంలో కుల రాజకీయాలు మళ్లీ ఊపందుకున్నాయి. కులాల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నది మాత్రరం..అగ్రకులాల వారే. ఇతర కులాల వారికి ఓ బొక్కేసి...వారిపేరు చెప్పి అధికారం చెలాయిస్తున్నారు. అంతే తప్ప వారికి రాజ్యాధికారం మాత్రం అప్పగించడం లేదు. ఎస్సీ,ఎస్టీలకు అధికారం చెలాయించే పదవులు లేనేలేవు. రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము ఉన్నా... ఆ పదవి ఓ ఉత్సవ విగ్రహం లాంటిదే. పార్టీ అధ్యక్ష పదవులు మొదలు సిఎంలు, ప్రధానులు, ఇలా అంతా అగ్రకులాల పెత్తనమే నడుస్తోంది. బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను కేవలం ఓటు బ్యాంక్ చేసుకుని రాజకీయాలు చేస్తూ..అధికార పెత్తనం చెలాయిస్తూ దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టకుండా అడ్డుకుంటున్నారు. కులాల కుంపట్లు రగిల్చి సాధించేదేమీ లేదు. అవతల అన్ని దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం మాత్రం కులాలు, వర్గాలు అంటూ కొట్టుకు చస్తున్నాం. దీనికితోడు సిద్ధాంత నిబద్ధత లేని రాజకీయాలు సాగుతున్నాయి. విద్వేషాలు, విభేదాలతో రాజకీయాల్లో నెగ్గుకు కావడం కుదరదు. దేశంలో అనేక తప్పిదాలకు కారణమైన కాంగ్రెస్ ఇప్పుడు ఎదుటి పార్టీని విమర్శిస్తూ అధికరాం కోసం అర్రులు చాస్తోంది. ఇకపోతే అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఎ పదేళ్ల కాలంలో చేసినన్ని తప్పులు లెక్కించడానికి సమయం సరిపోదు. పదేళ్లలో దేశాన్ని వెనక్కి నెట్టిన ఘనులు వీరు. ఆపరేషన్ సిందూర్‌ను విమర్శించడం దారుణం కాక మరోటి కాదు. గతంలో సర్జికల్ స్ట్రయిక్స్‌ను సైతం విమర్శించారు. ఇవన్నీ ప్రజలు ఇంకా మరచిపోలేదు. వీటిని విస్మరించి బిజెపి చేస్తున్న పాలనపై విమర్శలు చేయడం ద్వారా తమ తప్పులను కప్పిపుచ్చు కోవడం కుదరదు. దమ్ముంటే తాము చేసి తప్పులను, తప్పుడు నిర్ణయాలపై చర్చకు రావాలి. ఇకపోతే ఎంతసేపు విభజించు పాలించు అన్న రీతిలో కులమతాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావడం కూడా కుదరకపోవచ్చు. కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహింస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే రాజకీయాలను అన్ని పార్టీలు దూరం పెట్టాలి. నిజానికి మైనార్టీల సంతుష్టీకరణతో విభజన రేఖలు గీస్తున్నది రాజకీయ పార్టీలే. అన్ని వర్గాలను సమానంగా చూసే రాజకీయాలు దేశానికి అవసరం. ఇప్పటికే మత ప్రాతిపదికన దేశం విచ్ఛిన్నం అయ్యింది. దేశ విభజన జరిగింది. ఇంకా ఆ పీడకల నుంచి మనం బయటపడలేదు. ఈ క్రమంలో సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎవరు చేసినా..చేపట్టినా నిర్ద్వందంగా ఖండించాల్సిందే. అఘాయిత్యాలను ఎత్తి చూపాల్సిందే. ప్రజా సంక్షేమానికి పోరాడాల్సిందే. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని మంచి పాలన అందించేందుకు అసవరమైన సూచనలు ఇవ్వాల్సిందే. కానీ ఇంకా దేశంలో సగం జనాభాగా అవుతున్న వారిని కూడా మైనార్టీలుగా చూపుతూ.. ఓటు బ్యాంకుగా చూసే దుస్థితి పోవాలి. వారిని ఈ దేశ సంస్కృతి లో భాగంగా చూడాలి. అలాగే సమస్యలను అజెండాగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ప్రధానంగా ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా మేల్కోవడం లేదు. పడికట్టు పదాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి రాజకీయ పబ్బం గడపాలనుకోవడం వారి దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. ప్రజల్లో ఐక్యతా నినాదాన్ని తీసుకుని రావాలి. కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యలపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి. అంతేగాని హిందుత్వ పేరుతో హిందువులను కించపరిచే రాజకీయాలు చేయడం మానాలి. ఎంతసేపు ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మగా మారిందనీ..మోదీ సర్కారు నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని, హిందుత్వ విధానాలు అవలంబిస్తోందని కాంగ్రెస్, వామపక్ష నేతలు చేస్తున్న విమర్శలు హిందువులను అవమానించడం తప్ప మరోటి కాదు. మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణితో ఉంది.హిందువులు ఏదైనా చేస్తే దానిని భూతద్దంలో చూపించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ముస్లిం తీవ్రవాదాన్ని మాత్రం గట్టిగా ఖండించడంలో నాలుకలు మడతపడే స్తున్నారు. ఇందుకు మొన్నటి పహల్గామ్ దాడి తరవాత ముస్లిం టెర్రరిజాన్ని గట్టిగా కడిగి పారేయడంలో రాజకీయ పార్టీలు వెనకంజ వేశాయి. అందుకే ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో కఠినంగా లెఫ్ట్ ఉండలేక పోతోంది. మతోన్మాద రాజకీయాలను భాజపా సర్కారు ప్రోత్సహిస్తోందని.. అంటున్న వారు ఇస్లామిక్ ఉగ్రవాదుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించి అందుకు అనుగుణంగా ఉద్యమించ లేకపోతున్నారు. వామపక్షాల ఐక్యత అన్నది నినాదంగా మారుతోంది. ఏళ్లుగా ఈ విషయంలో తర్జనభర్జనలే తప్ప కార్యాచరణ లేకుండా పోవడానికి వారి పిడి వాదాలే కారణం. ప్రపంచం అంతా మారుతోంది. ఏ దేశమైనా సమస్యలతోనే పోరాడుతోంది. వీరు నమ్ముతున్న చైనా కూడా ప్రజల సమస్యలను ఎజెండా చేసుకునే పోరాడుతోంది. అయినా అక్కడ ఇస్లాంకు స్థానం లేకుండా అణచి వేస్తున్నారు. దీనిని ఇక్కడి కమ్యూనిస్టులు గుర్తించరు. ప్రస్తావించరు. చైనా తీరును ఎండగట్టరు. కానీ భారతదేశంలో కలసిమెలసి జీవించే విధంగా ప్రజలు ముందుకు సాగుతున్నా..వీరు ఆజ్యం పోస్తుంటారు. ఈ ప్రయత్నాల నుంచి వారు బయటప పడాలి. విపక్షాలు కూడా ప్రజల ఎజెండాతో ముందుకు సాగాలి. అప్పుడే ప్రజలు కూడా ఆదరిస్తారు. కులమతాలను పక్కన పెట్టి పేదల ఆర్థిక అభివృద్ధికి ముందుకు సాగాలి. పేదలు లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి. అప్పుడే దేశం బాగుడపుతుంది.

# ఉనికి కోల్పోతున్న కమ్యూనిస్టులు



### బలమైన ప్రజా ఉద్యమాల నిర్వహణలో విఫలం
### కలసి నడవాలన్న ఆలోచనలకు దూరం

న్యూఢిల్లీ : దేశంలో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించిన లెఫ్ట్ పార్టీలు ఇప్పుడు చతికల పడ్డాయి. వాటికి ఎజెండా అన్నది లేకుండా పోయింది. బర్ధన్, సీతరాం ఏచూరి వంటి మహానేతలు అంతరించడంతో వారి స్థాయినేతలు కానరావడం లేదు. కమ్యూనిస్టులు అనే పదం కాలం చెల్లిందన్న రీతిలో రాజకీయాలు సాగుతున్నాయి. ఇక లెఫ్ట్ ఐక్యత లేదా విలీనం విషయంలో సిపిఐ ఎప్పుడూ ఉదారంగా మాట్లాడుతుంటుంది. కానీ సిపిఐకి బలం లేకుండా పోయింది. ఇటీవల ఉన్న జాతీయ పార్టీ ముద్రను కూడా కోల్పోయింది. ప్రతిసారీ జరిగే లెఫ్ట్ సమావేశాల్లో ఐక్యత, ఐక్య పోరాటల గురించి చెబుతున్నా కార్యాచరణ అన్నది లేకపోవడం కారణంగా కమ్యూనిస్టులు ముందుకు సాగడం లేదు. అందుకే ఒక్కో రాష్ట్రంలో అధికా రాన్ని కోల్పోతున్నారు. సత్వర రాజకీయ అవసరాలపైనా చర్చించి ప్రజల్లో నమ్మకం కలిగేలా చేస్తే తప్ప లెఫ్ట్‌కు అవకాశాలు లేవనే చెప్పాలి. ఈ క్రమంలో తమ ఆలోచనలకు దగ్గరగా ఉన్న లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించాలి. వామపక్ష ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి. రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా లెఫ్ట్ పార్టీలు ముందుకు రావాలి. ఈ క్రమంలో లెఫ్ట్ పార్టీలు నిర్మాణాత్మక రాజకీయాలకు పూనుకుంటే తప్ప ప్రజలు నమ్మరు. ఇప్పటి నుంచే ఈ రకమైన భావజాలంతో ముందుకు సాగితే ఫలితం ఉండొచ్చు. ఇకపోతే వారు తమ ఉనికిని మరచి రాజకీయాలు చేయడం వల్లనే ప్రజలకు దూరమవుతూ వచ్చారు. ప్రజలను కలుపుకుని పోరాడాలన్న ఆకాంక్ష కమ్యూనిస్టు కార్యకర్తల్లోఉన్నా నేతలు ముందరి కాళ్లకు బంధం వేస్తున్నారు. ఇతర పార్టీలతో పొత్తులకు వెంపర్లాడుతున్న లెఫ్ట్ నేతలు సంస్థాగతంగా బలహీనం అవుతున్నాయి. గతంలో కమ్మూనిస్టులకు ఉన్న ప్రజాదరణ కాలక్రమేణా కనుమరుగవుతోంది. మారుతున్న కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకోకపోవడం లేదు. వీరు ఎంతసేపూ మరో పార్టీకి తోకపార్టీగా మారడం మినహా గట్టిగా చేస్తున్న ప్రయత్నాలు చేయడం మానేశారు. ఆయా రాష్ట్రాల్లో పూర్తిగా అదృశ్యం అయిన లెఫ్ట్ పార్టీలు.. ఇతర పార్టీల తోక పట్టుకుని నడిచే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆ పార్టీల్లో ఆత్మవిమర్శ అన్నది మచ్చుకైనా కానరావడం లేదు. పోరాటాల్లో ఆరితేరిన లెఫ్ట్ పార్టీలు ఎందుకనో ప్రజల్లో స్థానం సంపాదించు కోలేక పోతున్నారు. లెఫ్ట్ బలహీనం కారణంగా ఇతర రాజకీయ పార్టీలు తమ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు లెఫ్ట్ పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి కనీసం కూటమిగా అయినా ముందుకు సాగాలి. కానీ కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా కూటమి అవకాశాలను వారే దెబ్బతీస్తున్నారు. విలీనం కావాలన్న ఆశ ఎలాగూ నెరవేర నప్పుడు కనీసం కూటమిగా ముందుకు సాగాలన్న గట్టి నిర్ణయం తీసు కోవడం లేదు. ప్రస్తుతం దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొం టోందనీ.. ఈ దశలో వామపక్షాల ఐక్యత అత్యవసరమని పలు వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, బ్యాంకు ఉద్యోగులు, మేధావులు వేర్వేరు రూపాల్లో నిరసన గళం వినిపిస్తున్నారు. ఇది మరింత విస్తృతమవ్వాల్సి ఉంది. ఇందుకు కమ్యూనిస్టులు నిస్వార్థంగా అడుగులు వేయడం లేదు. అందుకే భాజపా వ్యతిరేకగళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. వామపక్ష కూటమి విదేశాల్లో విజయాలపై చర్చిస్తున్నా దేశంలో మాత్రం అందుకు అనుగుణంగా అడుగులు పడడం లేదు.

## కేసీఆర్ అసలు రంగు బయటపడింది: బీర్ల ఐలయ్య

హైదరాబాద్ : కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ అసలు రంగు బయటపడిందని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను కలపాలని ఆయన చూసినట్లు- బయటపడిందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 8 సీట్లు రావడానికి బీఆర్ఎస్ పార్టీనే కారణమని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయడానికి ఆ రెండు పార్టీలు ఏకమయ్యాయని చెప్పారు బీర్ల ఐలయ్య. కేసీఆర్ ఎందుకు బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారో కవిత బయట పెట్టాలని బీర్ల ఐలయ్య కోరారు. కేటీఆర్ బండారాన్ని కవిత బయట పెట్టిందని చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి కవితను బయటకు పంపించడానికి కేటీఆర్ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సొంత చెల్లిని చూసి ఓర్వలేని కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలను ఎలా గౌరవిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ దమ్ముంటే కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో డీల్‌పైన బీఆర్ఎస్ కార్యకర్తలకు సమాధానం చెప్పాలని కోరారు. కుటు-ంబాన్ని చక్కపెట్టుకోలేని కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతారా అని బీర్ల ఐలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అధికారం కోసం రాజకీయ డ్రామాలు

**ఎందరో ఉద్యమకారులను మింగిన బిఆర్ఎస్**

**అధికారం కోసం ఏమైనా చేసే కెసిఆర్ కుటుంబం**

**కెసిఆర్ ఫ్యామిలీపై మండిపడ్డ ఎమ్మెల్యే యెన్నం**

హైదరాబాద్ : బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాయడం, లేఖలోని అంశాలు, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. అలాగే కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న పరిస్థితులపై అధికారపక్ష నేతలు తమదైన రీతిలో స్పందిస్తున్నారు. ఇందంతా డ్రామా అటూ కొట్టిపారేస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. కల్వకుంట్ల ఫ్యామిలీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చేందుకే ఇలాంటి కుతంత్రాలకు తెరతీశారంటూ మండిపడ్డారు. ఇదంతా కేవలం స్టంట్ రాజకీయమని అన్నారు. భారత దేశం కర్మ భూమి అని.. ఇక్కడి పాపలకు ఇక్కడే శిక్ష అనుభవించాలన్నారు. ఉద్యమకారుల గొంతులను కొడుకు, బిడ్డలు కోశారని.. అందులో కవిత పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ఎంతో మంది రాజకీయ జీవితాలతో ఆడుకున్న కుటుంబం వాళ్ళది అంటూ కల్వకుంట కుటుంబంపై విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబాన్ని మేనేజ్ చేసుకోలేని వ్యక్తి తెలంగాణను మళ్ళీ ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం ఉంటే తెలంగాణ నాశనం అవుతుందని అప్పుడే చెప్పానన్నారు. పనికి రాని ప్రాజెక్టులు కట్టి.. అప్పులు ప్రజలకు రుద్దారని ఫైర్ అయ్యారు. అధికారం లేకపోతే ఒక్క నిముషం కూడా ఉండలేని కుటుంబం అని.. సొంత కుటుంబం సభ్యులు ఒకరి గొంతు ఒకరు కోసుకుంటున్నారని అన్నారు. దీనితో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధికారంలోకి రావడానికే కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. కేకే, మహేందర్ రెడ్డిని గెంటేసింది తమరు కాదా అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పెట్టడానికి, అధికారంలోకి రావడానికి కృషి చేసిన వేలమంది గొంతులు తడిగుడ్డతో కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం కొత్త సినిమా చూపిస్తోందని అటూ కామెంట్స్ చేశారు. పాలనకు కేటీ-ఆర్ అనర్హుడని కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ అధికారం కోసం మాత్రమే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికార దాహం కోసం చూస్తున్నారన్నారు. కేసీఆర్‌ను మరోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వీరి డ్రామాలు ఇక చాలించాలని, ప్రజలుకూడా వీరి రాజకీయాలు గమనించాలని అన్నారు.

## ప్రతికూల వాతావరణం

**ప్రధాని సిక్కిం పర్యటన రద్దు**

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిక్కిం పర్యటన రద్దయింది. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన సిక్కిం పర్యటన రద్దు అయింది. అయితే సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా తన సందేశం వినిపించారు. రూ.750 కోట్ల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. కాగా గురువారం నుంచి మూడు రోజుల పాటు- ప్రధాని మోదీ ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. 6 బహిరంగ సభలతో పాటు- రోడ్ షోలు నిర్వహించనున్నారు. సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ లో ప్రధాని పర్యటించనున్నారు. వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తన సభల్లో ప్రధాని మోదీ ఫోకస్ చేయనున్నారు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపో వడంతో ఈరోజు మోదీ సిక్కిం పర్యటన రద్దయింది. తర్వాత ఆయన రాష్ట్రాల పర్యటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## కెసిఆర్ ఫ్యామిలీ డ్రామాలు అదుర్స్

**కవిత లేఖ..వ్యాఖ్యలతో మరింత స్పష్టం: ఆది శ్రీనివాస్**

కరీంనగర్ : బిఆర్ఎస్‌లో రాజకీయ డ్రామాలు పరాకాష్టకు చేరాయని, డాడీ డాటర్ లేఖపై ప్రజల్లో చర్చ జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కవిత లేఖతో కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని ప్రజలు గ్రహించారన్నారు. అలాగే తాజాగా కవిత వ్యాఖ్యలు చూస్తుంటే ఫ్యామిలీ గొడవులు తారాస్థాయికి చేరాయని అర్థం అవుతోందన్నారు. తెలంగాణ ప్రజలను వంచింది, ఎందరో ఉద్యమకారులను అణచివేసి అధికారం అనుభవించారని అన్నారు. అధికారం కోసం రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదని అప్పులు చేసిన ఘనమైన కుటుంబం వారిదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం విచారణ సమయంలో ఇలాంటి డ్రామాలను ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిజమే అని కవిత లేఖతో స్పష్టమైందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## మంచి మాటలే కొండంత ఓదార్పు!

తిరుమల : మాటలను ఆచితూచి వాడాలి. వినయంగా ఉండాలి. ఎదుటివారికి స్వాంతన కలిగించేలా మాట్లాడాలి. మన ప్రవర్తన ఎదుటివారిలో ధైర్యాన్ని నింపాలి. నేనున్నానని భరోసా ఇవ్వగలగాలి. భగవంతుడు కూడా ఇదే కోరుకుంటాడు. కొంతమంది అకారణంగా మాటల ఈటెలతో ఎదుటివారి మనసును గాయ పరుస్తారు. అది వారి నైజం. శారీరక గాయంలా, మానసిక గాయం బయటికి కనిపించదు గాని ఆలోచనలను అస్థిరపరుస్తుంది. అటువంటివారిని కనిపెట్టి ఉపశమనంగా చెప్పే మాటలు మనసు గాయానికి చల్లదనాన్ని ఇచ్చే లేపనమై కర్తవ్యాసక్తులను చేస్తాయి. అందరూ మానసికంగా దృఢంగా ఉండరు. మానసిక అధైర్యులు ఉంటారు. వారిని కనిపెట్టుకుని ఉండాలి. వీలైనంత వరకు వారితో గడుపుతూ మాటల ఉత్ప్రేరకాన్ని అందిస్తుండాలి. మనసు నెమ్మదించిన మనిషికి ఆకాశమే హద్దు. అలాంటి వారే విజయం సాధిస్తారు. వ్యాకులత చెందిన వారిని దగ్గరకు చేర్చాలి. ధైర్యం కల్పించాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడితే ఎంత ఆనందం లభిస్తుందో అంతటి ఆనందం మంచి మాటల వల్లా కలుగుతుంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటేనే పరమాత్ముడు కూడా అనుగ్రహస్తాడు. ఆకలిగొన్నవాడికే అన్నం పెట్టాలి. కడుపు నిండిన వాడికి అన్నం పెట్టడం సరికాదు. విజయం సాధించిన వారినే ప్రజలు వెన్నంటి ఉంటారు. అతడిని అంతా తమవారుగా పొగిడేస్తారు. అలా అతడిని అంటిపెట్టుకుని ఎంతోమంది ఉంటారు. అది లోక సహజం. అపజయం పొందిన వ్యక్తికి ఆసరాగా నిలవడమే నిజానికి గొప్ప విషయం. ఆ సమయంలో వ్యక్తపరచే సంఘీభావం ఓటమి పాలైన మనిషికి వెన్నుదన్ను అవుతుంది. తనకు మానసిక ప్రశాంతత ప్రసాదించిన వ్యక్తిని ఎన్నటికీ మరవడు. జీవితమంటే కష్ట సుఖాల కలయిక.. బాధల్లో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వ లక్షణం. అదే జీవితాన్ని నిలబెడుతుందని గుర్తించి మసలుకోవాలి.



ఆధ్యాత్మికం

## సిబిఎస్ఈ సెలబస్‌పై సమీక్షా సమావేశం



**యైటింక్లయిన్ కాలని. :** స్తానిక సింగరేణి సెక్టార్.3 ఉన్నత పాఠశాలలో వచ్చే నెల జూన్ 12 నుండి ప్రవేశపెట్టనున్న సిబిఎస్ఈ సెలబస్ పై, రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య గురువారం సంస్థ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి.శ్రీనివాస్‌తో సమీక్షా సమావేశం జరిపారు. ఉదయం ఏరియా కార్యాయం లోని జీఎం చాంబర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న జీఎం వెంకటయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో అడ్మిషన్స్ ప్రాసెస్, స్టాఫ్ రిక్రూట్మెంట్ సంబందించిన అంశాలపై చర్చించారు. సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం చేతుల మీదుగా జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేయనున్న ఏర్పాట్లు, వసతులు, ఇతరత్ర విషయాలను అడిగి తెలుసుకుని, తగు సూచనలిచ్చారు. అలాగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంకా ఈ సమీక్షా సమావేశంలో ఏరియా ఎస్ఓ టు జిఎం ఎం.రాముడు, ఏరియా రక్షణ అధికారి సంతోష్ కుమార్, పాఠశాల కరెస్పాండంట్ డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డిజిఎం (ఐఈ) మురళీకృష్ణ, డిజిఎం సివిల్ ధనుంజయ, హెడమాస్టర్ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కందికట్కూరులో కమ్యూనిటీ పోలీస్ పై అవగాహన



**ఇల్లంతకుంట,మే 29,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూరులో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు కమ్యూనిటీ పోలీస్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు సరైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ అత్యవసర పరిస్థితులలో డయల్ 100ను ఉపయోగించుకుంటే పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాత్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ ప్రజలకు సూచించారు.

## వైద్య శాఖపై సింగరేణి సిఎండి సీరియస్



**యైటింక్లయిన్ కాలని. :** సింగరేణి లోని అన్ని ఏరియాల వైద్య అధికారులతో సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ ముఖ్యాధికారి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమీక్షా సమావేశం లోని వివరాల ప్రకారం వైద్య సేవలో సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని, చిన్నచిన్న వ్యాధులకు కంపనీ ఆసుపత్రి లోనే వైద్యం చేయాలని, సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల వ్యయం అయినాసరే, అన్ని కేసులను రిఫరల్ కి పంపితే మీ నైపుణ్యత ఏమిటనీ, సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, కోవిడ్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని, సిఎండి బలరాం అన్ని ఏరియాల వైద్యాధికారులకు సూచించారు. సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోరకు అయ్యే ఖర్చుకు వెనకాడకుండా, అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని, ఇప్పటికే పలుమార్లు చెప్పడం జరిగిందని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదంటూ వైద్య శాఖపై ఆయన ఆగ్రహం చెందారు. ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనికీల్లో ఏ ఒక్క పరికరం లేదనే మాట రాకూడదని ఆయన వైద్యాధికారులను హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు, ఏఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలనీ సూచించారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందని, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా, వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు, నేడు రూ. 100 కోట్లకు చేరిందని ఆయన పేర్కొన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందనీ ఆయన అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన వైద్యాధికారులు కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోందనీ, ఆసుపత్రులను ఆధునీ కరిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నాయని, ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థలో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలచుకోవాలని ఆయన హితువు పలికారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని సిఎండి బలరాం ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్‌పి (పా), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం (మార్కెటింగ్), ఎన్.వి.రాజశేఖరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ విధ్వంసాలను ఆపలే(రు)రా?

◆ మొన్న గుంపుల స్మశాన వాటిక ◆ నిన్న కొమిరె ఊర పోచమ్మ ◆ నేడు పొత్కపల్లి పోత లింగన్న ◆ ప్రేక్షక పాత్రలో పోలీసులు

◆ హిందూ సంప్రదాయ కట్టడాల మీద జరుగుతున్న వరుస దాడులపై అందిస్తున్న ప్రత్యేక కథనం మీకోసం...

**( హైదరాబాద్ ) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో ఇటీవల కాలంలో హిందూ సంప్రదాయ కట్టడాలపై ( దేవాలయాలు, స్మశాన వాటిక)వరుస దాడులు జరుగుతున్నాయి. కొంతకాలం క్రితం గుంపుల గ్రామంలోని స్మశాన వాటిక ను కొందరు దుండగులు రాత్రికి రాత్రి నేలమట్టం చేసిన సంగతి మరవకముందే కొమరె గ్రామంలో ఊరపోచమ్మ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేశారు. నిన్న రాత్రి పోత్కాపల్లి లో పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న పోచమ్మ ఆలయంలోని పోత లింగన్న విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.హిందూ సంప్రదాయ కట్టడాలపై ఇలా వరుసగా దాడులు జరుగుతున్నా కూడా పోలీసు వ్యవస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. దేవాలయాల పైన, ప్రభుత్వ ఆస్తులపైన జరుగుతున్న ఈ విధ్వంసాలపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొత్కపల్లి ప్రాంతంలో హిందూ ముస్లింలు ఇంతవరకు ఏ విధమైన ఘర్షణలు లేకుండా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరి దృష్టి కూడా ముందుగా ముస్లింల పైకి వెళ్లడం సహజం. కానీ వాస్తవానికి ఈ సంఘటనలతో వాళ్లకు ఎలాంటి సంబంధం లేదు. కంచె చేను మేసినట్టు, పాము తన సంతతిని తానే నాశనం చేసుకున్నట్టు.. ఇంటి దొంగలే ఇలా చేస్తూ సభ్య సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలా హిందూ కట్టడాలపై దాడులు జరుగుతున్నా కూడా పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో సమస్య జటిలమై ఎవరైనా అగ్గిపుల్ల గీకితే మతపరమైన అల్లర్లుగా పక్కదారి పట్టే అవకాశం ఉన్నది. పైగా నేరస్తులకు కూడా భయం లేకుండా పోతున్నది. ఇలాంటి సున్నిత సమస్యలను పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో నేర స్వభావం ఇంతింతై వటుడింతై అన్నట్టు మహా వృక్షం లాగా మారే



నిన్న రాత్రి ధ్వంసానికి గురైన విగ్రహం

ప్రమాదం ఉండడంతోపాటు పోలీసు వ్యవస్థ దోషిగా నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంతలా అభివృద్ధి చెందినా కూడా సమీప నేరస్తులను పట్టుకోకపోవడం పోలీసుల వైఫల్యం గానే స్థానికులు చెబుతున్నారు. అంతర్రాష్ట్ర దొంగలను, సైబర్ నేరగాల్లను సైతం ఎంతో చాకచక్యంగా పట్టుకొని కటకటాల వెనక్కి తోసిన పోలీసులు ఈ సంఘటనల మీద స్పందించడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు నేరగాళ్లపట్ల ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నారని అందువల్లనే మరో నేరానికి అవకాశం లభిస్తున్నట్టు అవుతున్నది. చిన్నపాము నైనా పెద్దకర్రతో కొట్టాల్సిన పోలీసులు పెద్ద నేరాగాల్లను సైతం వదిలేయడంతో ఈ విధ్వంసాలకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది. గత సంవత్సరం గుంపులలో జరిగిన స్మశాన వాటిక ధ్వంసం కేసులో అసలు నేరస్తులను దాచిపెట్టి అమాయకుని పై కేసు పెట్టడాన్ని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. అర్ధరాత్రి జెసిబి తో ధ్వంసం చేస్తే పిలిచిన వాళ్లను పక్కకు పెట్టి ఆపరేటర్ పై కేసు నమోదు చేశారు. జెసిబి ఆపరేటర్ కు స్మశానవాటికను ధ్వంసం చేయాల్సిన అవసరం ఏమిటి? పైగా అతనికి.. ఆ గ్రామానికి ఎలాంటి సంబంధం కూడా లేదు. ఈ విధంగా పోలీసులు ఆ కేసును నీరుగార్చి పూర్తిగా తప్పుదోవ పట్టించడాన్ని బాహాటంగా ఖండించ లేకున్నా లోలోపల మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ తర్వాత కొమిరె గ్రామంలో జరిగిన మరో సంఘటనను ఏమాత్రం వెలుగులోకి రానీయకుండా ఆపడం జరిగింది. హుందాగా వ్యవహరించాల్సిన పోలీసులు నేరస్తులకు కొమ్ముగాస్తూ కేసులను పక్కదారి పట్టించడంతో పోలీసు వ్యవస్థ పైన ప్రజలకు రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతున్నది. ఇప్పుడు పోత్కాపల్లి రైల్వే గేట్ సమీపంలోని పోచమ్మ దేవాలయంలో ఉన్న పోత లింగన్న విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో హిందూ సంఘాలు తీవ్ర నిరసన తెలియజేస్తున్నాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు లేపుతూ శాంతి భద్రతలకు సవాలుగా మారిన ఈ సంఘటనలకు సంబంధించిన దుండగులను పోలీసులు కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అసలు నేరస్తులను పక్కన పెట్టినన్ని రోజులు ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయని, ఇకనైనా పోలీసులు నేరస్థులపై ఉక్కుపాదం మోపాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేదు మేమెంత? అని పోలీసులు పాత విధానాన్ని అనుసరిస్తారా? లేక అసలు నేరస్తులను పట్టుకుంటారా? అంటూ కొందరు సెటైర్లు వేస్తున్నారు.



గత సంవత్సరం గుంపులలో ధ్వంసమైన స్మశాన వాటిక

## నాణ్యత ప్రమాణాలు పెంచి వినియోగదారులను నిలుపుకోవాలి

◆ నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలి ◆ పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలి ◆ కోలిండియా, సింగరేణి పై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష

◆ పాల్గొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్

**గోదావరిఖని ప్రతినిధి :** రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్త పరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరపున సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా




వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత, ముందంజ

◆ బోనస్ చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా టాప్ ◆ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

◆ పత్తిపాక రిజర్వాయర్ తో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

◆ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు



**పెద్దపల్లి ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి మరియు వానాకాలం పంట సన్నద్ధత ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మరియు సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు జిల్లాల కలెక్టర్లతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత వర్షాకాలంలో తెలంగాణ రాష్ట్రంలో 1234 కోట్ల రూపాయలు సన్నవడ్లకు బోనస్ గా చెల్లించగా, అందులో 114 కోట్ల రూపాయలు పెద్దపల్లి జిల్లాకే చెల్లింపులు చేయడం జరిగిందని తెలియజ్జెశారు. 59 కోట్ల రూపాయలు పెద్దపల్లి నియోజకవర్గానికి బోనస్ డబ్బులు అందాయన్నారు. ఇట్టి చెల్లింపులు రాష్ట్రములోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. జిల్లాలో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి 91శాతం డబ్బులను రైతులకు సకాలంలో అందించి ప్రభుత్వానికి ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకురావడం జరిగిందన్నారు. ఎలాంటి కటింగులు లేకుండా ధాన్యాన్ని సేకరిస్తున్నట్టు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్వింటాలకు 10 నుండి 15 కిలోల చొప్పున కటింగులు పెట్టి రైతులను నిలువునా దోచుకున్నారని, గతంలో కొందరు మిల్లర్లు సిఎంఆర్ పెట్టకుండా ఎగవేసిన బకాయిలను సైతం రాష్ట్ర ప్రభుత్వం రాబట్టి ప్రజలకు మేలు చేస్తుందని అన్నారు. ఇదే క్రమంలో ఇటీవల ధాన్యం కొనుగోలు సెంటర్ల ద్వారా సేకరించిన సన్న వడ్లను మిల్లర్లకు అప్పగించడం జరిగిందని, అయితే ప్రస్తుత సీజన్లో ఇట్టి వడ్లకు నూక శాతం ఎక్కువగా ఉంటుందని మిల్లర్లు ఆందోళన చెందుతున్నారని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇట్టి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రి గారిని కోరారు. అలాగే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి సాగునీటి సమస్య లేకుండా చూడాలని మంత్రిని కోరారు. గత బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో కాకతీయ కాలువకు ఎలాంటి మరమ్మతులు చేయలేదన్నారు. ప్రస్తుతం వరద కాలువ ద్వారా నీటి పంపిణీ చేసి రైతులను ఆదుకోవడమే కాకుండా రెండు టీఎంసీల నీటిని ఆదా చేయడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేయకుండా ఆర్థిక ఇబ్బందుల వల్ల వదిలివేసిన పేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు కేటాయించడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించి కొత్తగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని కోరారు.

# సింగరేణి వైద్యులూ మీసామర్థ్యం నిరూపించుకోండి

**◆ చిన్నచిన్న వ్యాధులకు మన వద్దే వైద్యం చేయండి ◆ సింగరేణి వైద్య విభాగానికి ఏటా 400 కోట్ల వ్యయం ◆ అయినా సరే అన్ని కేసులను రిఫరల్ కి పంపితే ఇక మన నైపుణ్యత ఏమిటి ◆ సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించండి ◆కోవిడ్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి ◆ అన్ని ఏరియాల వైద్యాధికారులు సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్**




**గోదావరిఖని ప్రతినిధి :** సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించడం కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చటానికి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, అయినప్పటికీ కొన్ని ఏరియా ఆసుపత్రుల నుండి ప్రతిపాదనలు పంపడంలో ఎందుకు శ్రద్ధ వహించడం లేదు అని సింగరేణి వైద్య శాఖ పై ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావలసి ఉన్న కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీలలో ఏ ఒక్క పరికరం లేదు అనే మాట రాకూడదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక పేర్లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు ఏ ఏ పరికరాలు కావాలన్నది నిర్ధారించుకొని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్ లను సమకూర్చేందుకు యాజమాన్యం సంసిద్ధంగా ఉందన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఏరియా ఆసుపత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకుండా వెంటనే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, తద్వారా గత మూడేళ్లలో 30 కోట్ల రూపాయలు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు 100 కోట్లకు చేరాయి అన్నారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతి చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. డాక్టర్లు అంకితభావంతో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో పూర్తి క్రమశిక్షణ పాటించాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం యాజమాన్యం ఏటా 400 కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. ఆసుపత్రులను ఆధునికీకరిస్తోందని తెలిపారు. హైదరాబాద్ లోనూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న వైద్యులంతా పూర్తి అంకిత భావంతో పనిచేయాలని, కార్మికుల నమ్మకాన్ని గెలుచుకోవాలని సూచించారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయటానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ సానుకూల దృక్పథాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందని ఛైర్మన్ పేర్కొన్నారు. కాగా కోవిడ్ వ్యాప్తి జరిగినట్లయితే దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు(ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ రావు (ఆపరేషన్స్), కె.వేంకటేశ్వర్లు (పి అండ్ పి, పా), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, అన్ని ఏరియా ఆసుపత్రుల ముఖ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా బిజెపి ప్రభుత్వం

**◆ పంటల కనిన మద్దతు ధరలు పెంచడం గొప్ప నిర్ణయం ◆ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బిజెపి శ్రేణులు**



**పెద్దపల్లి ప్రతినిధి :** సరైన సమయంలో అసాధారణ నిర్ణయాలు తీసుకుంటూ దేశాన్ని అభివృద్ధిబాటలో ప్రధాని నరేంద్రమోదీ నడిపిస్తున్నారని భారతీయ జనతా పార్టీ నేతలు పేర్కొన్నారు. 2025-26 యేడాదికిగానూ వివిధ పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. దీనిలో భాగంగా గురువారం పెద్దపల్లి పట్టణంలోని జెండాకూడలి వద్ద నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఖరీఫ్ పంటల ఎంఎస్పిని ఖర్చు కంటే 50శాతం అధికంగా ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. దీంతోపాటు రుణాలపై వడ్డీ రాయితీ కూడా రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశంలో 7కోట్ల 75లక్షలకు పైగా కెసిసి ఖాతాలున్నాయన్న వారు, వ్యవసాయానికి సంస్థాగత రుణ ప్రవాహాన్ని కొనసాగించడంలో ఈ మద్దతు చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ఉత్పాదకతను పెంచడానికి, చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక అవసరాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కీలకంగా మారుతుందన్నారు. 2014లో కెసిసి ద్వారా రూ.4కోట్ల 26లక్షలకోట్ల రుణాలివ్వగా, 2024నాటికి అది రూ.10లక్షల 5లక్షలకోట్లకు పెరిగిందని వివరించారు. దీని ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు పొందడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి సహాయపడుతుందని రాకేష్, రమేష్ స్పష్టం చేశారు. అనంతరం రైతులకు మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, యాంసాని వేణు, రాజం మహాంతకృష్ణ, ఉప్పు కిరణ్, సబ్బు మల్లయ్య, బోలవేన సురేందర్, రాజు, గాదాసి సతీష్, సంపత్, మధు, పోగుల రాజు, బొడ్డుపల్లి అంజి, రెండ్ల వేణు, పడాల శీను, బొడ్డుపల్లి కుమార్, శివ, సాయి, అంజి, హరీష్, సతీష్, భోగ గణేష్, అనిల్, సురేష్, ఉదయ్, సుమంత్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు చేయడం హర్షణీయం

**◆ సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే పటాలకు పాలభిషేకం**



**తొర్రూరు,:** పాలకుర్తి నియోజకవర్గానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని మంజూరు చేయడం హర్షినీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్‌లు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద బిడ్డలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలని సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే నియోజకవర్గ అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, ఝాన్సీ రెడ్డిలు 18 నెలల కాలంలోనే వందల కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేకల కుమార్, చెవిటి సధాకర్, పింగిలి ఉష, బూర్గుల ప్రశాంతి, బిక్షం గౌడ్,దొంగరి శంకర్, నల్లపు రాజు, వెన్నెం సోమిరెడ్డి, సహదేవ్, ఇమ్మడి శ్రీనివాస్,రాజేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, రమేష్ నాయక్, మహేష్ యాదవ్, బానోత్ సాగర్, గిరిధర్, వెలుగు మహేశ్వరి, తాటికాయల రాణి, అనిత, నల్ల మాస మహేష్, చిదిరాల రవి, వెంకటయ్య, అభిరామ్, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీ సమాచారం కోసం బెదిరించే వారిని లెక్క చేయవద్దు

**◆ గోప్యత గల కంపెనీ డాక్యుమెంట్లను బయటి వారికి ఇస్తే కఠిన చర్యలు ◆ బెదిరింపులకు, ఒత్తిడికి గురి చేసే వారి సమాచారం యాజమాన్యానికి తెలియజేయండి ◆ సింగరేణి ఉద్యోగుల అధికారులకు సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్ ) సూచన**



**గోదావరిఖని ప్రతినిధి :** సింగరేణి సంస్థకు సంబంధించిన గోప్యనీయ సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు కంపెనీ ఉద్యోగులని, అధికారులని బెదిరిస్తున్నట్లు, ఒత్తిడికి గురి చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇటువంటివారు ఏ స్థాయిలో ఉన్న వారైనా లెక్క చేయాల్సిన అవసరం లేదని, కంపెనీకి సంబంధించిన సమాచారాన్ని, కానీ డాక్యుమెంట్లను కానీ ఇతరులెవ్వరికీ ఇవ్వకూడదని సంస్థ డైరెక్టర్ పి పి పర్సనల్ గురువారం నాడు ఒక సర్క్యులర్ లో పేర్కొన్నారు. కీలకమైన శాఖల్లో ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని, గోప్యత పాటించాలని, బయటి వ్యక్తుల బెదిరింపులు లేదా ఒత్తిడులకు లోనై, కీలక సమాచారాలను, డాక్యుమెంట్లను ఇతరులకు అందజేయడం దుష్ప్రవర్తనగా భావించటం అవుతుందని హెచ్చరించారు. ఎవరి ప్రలోభాలకు, బెదిరింపులకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. గోప్యత గల సమాచారం కోసం డిమాండ్ చేస్తూ, ఒత్తిడి చేసే వ్యక్తుల సమాచారాన్ని యాజమాన్యానికి తెలియజేయాలని, ఈ విధంగా ఫిర్యాదు చేసే వారి సమాచారం బయటకు వెల్లడి కాకుండా కంపెనీ జాగ్రత్త వహిస్తుందని, బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక తర్వాత కూడా ఎవరైనా కంపెనీ యొక్క కీలకమైన, గోప్యనీయ సమాచారాన్ని బయటకు వెల్లడించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఆదేశించారు. అలాగే కంపెనీలో వివిధ కింది శాఖల నుండి పై శాఖల వారికి పంపించే నోట్ ఫైల్స్, ముఖ్యమైన పత్రాలను అత్యవసర సందర్భంలో కంపెనీ మెయిల్ ద్వారా పంపించవచ్చని, కానీ వాట్సాప్ ద్వారా మాత్రం పంపించకూడదని మరొక సర్క్యులర్ లో డైరెక్టర్ పా హెచ్చరించారు. వాట్సప్ ద్వారా పంపిస్తున్న సమాచారం ఇతరులకు లీక్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని కంపెనీ నోట్ ఫైల్స్, సమాచార ఫైల్స్ పంపించడానికి వినియోగించవద్దని ఆయన ఆదేశించారు.

## లైన్స్ క్లబ్ సెంటనారి కాలనీ ఆధ్వర్యంలో కాళేశ్వరం డైరెక్టర్ కాటం సత్యంకు ఘనంగా సన్మానం





**రామగిరి మే 29:** రామగిరి మండలం లైన్స్ క్లబ్ సెంటనారి కాలనీ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్బు సభ్యులు అందరూ కలిసి కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం ని ఘనంగా సన్మానించడం జరిగింది. కాళేశ్వరంలో 12 రోజులు సరస్వతి పుష్కరాలు జరుగుతే అక్కడే ఉండి రామగిరి మండలం కు సంబంధించిన ప్రజలకు పార్టీలకతీతంగా వారికి సహాయ సహకారాలు అందించిన ఘనత కాటం సత్యమేనని మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీలకతీతంగా లైన్స్ క్లబ్ సభ్యులందరం కలిసి కాటం సత్యం సన్మానించడం శుభ పరిణామం ప్రజల మననలు పొందడం ప్రజానాయకుడు అలవాటు చేసుకోవాలి ఏ పదవి వచ్చినా కూడా కాటం సత్యం లాగా ప్రజల్లో ఉండాలని అందరూ కొనియాడారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు మొలమూరు శ్రీనివాస్, డైరెక్టర్స్ బెల్లం శ్రీనివాస్, కళాధర్ రెడ్డి, సురేష్ బాబు, చారి, నజీమ్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

## ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..! రోజూ తింటే రోగాలు మాయం..

జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

# నిమిషాల్లో రూ. 1లక్ష విత్ డ్రా..

# పీఎఫ్ ఖాతాదారులు చేయాల్సిందిదే..

ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఖాతా ప్రతి ఉద్యోగికి ఉంటుంది. ఇది పదవీవిరమణ తర్వాత జీవితానికి ఉపయోగపడేలా రూపొందించిన స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) నిర్వహిస్తుంది. ప్రతి నెలా ఉద్యోగి నుంచి అలాగే తను పనిచేసే కంపెనీ నుంచి కొంత భాగం దానిలో జమవుతుంది. సాధారణంగా దీనిలో మొత్తాన్ని పదవీవిరమణ తర్వాత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎంప్లాయీ కంట్రిబ్యూషన్ నుంచి కొంత మొత్తాన్ని తీసుకునే వీలుంటుంది. వైద్య చికిత్స, వివాహాలు, విద్య, గృహ రుణాలు, గృహ నిర్మాణ ఖర్చులు వంటి నిర్దిష్ట ఆర్థిక అవసరాలకు దీని నుంచి నగదును ముందస్తుగా ఉపసంహరించుకునే వీలుంటుంది. అయితే ఎక్కువ శాతం మెడికల్ ఎమర్జెన్సీ వచ్చిన సమయంలోనే దీని నగదు విత్ డ్రా చేసేందుకు ఖాతాదారులు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో అత్యవసర చికిత్సల వేళ పీఎఫ్ నుంచి నగదు ఎలా విత్ డ్రా చేసుకోవచ్చు? తెలియాలంటే ఈ కథనం .. మెడికల్ ఎమర్జెన్సీ వేళ పీఎఫ్ ఉపసంహరణ.. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు లేదా ప్రాణాంతక పరిస్థితుల కారణంగా ఆస్పత్రిలో చేరిన సందర్భంలో,




ఈపీఎఫ్ఓ ??సభ్యులు రూ. 1 లక్ష వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. గతంలో ఈ అడ్వాన్స్ తీసుకోవాలంటే ఆస్పత్రి నుంచి ఎస్టిమేషన్ సమర్పించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఎటువంటి డాక్యుమెంటేషన్ అవసరం లేకుండానే రూ. లక్ష ఏక మొత్తంలో మెడికల్ అడ్వాన్స్ మంజూరు చేస్తున్నారు. ఎందుకంటే ప్రాణాంతకమైన అనారోగ్యాల విషయంలో, రోగిని అతని/ఆమె ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రిలో చేర్చడం తప్పనిసరి అని, అటువంటి తీవ్రమైన పరిస్థితుల్లో ఆసుపత్రి నుంచి అంచనాను పొందడం సాధ్యం కాదని ఈపీఎఫ్ఓఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని షరతులు ఉన్నాయి.. అయితే ఏక మొత్తంలో రూ. లక్ష విత్ డ్రా చేసే సమయంలో వ్యాధి చికిత్సకు సంబంధించి ఈఎస్ఐసీ లేదా సీజీహెచ్ఎస్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్ వంటి ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ విభాగంలో చేరిన వారు ఉపసంహరణలు చేయవచ్చు. ప్రైవేట్ ఆసుపత్రి విషయంలో మాత్రం ఈపీఎఫ్ఓ ప్రాథమికంగా కొన్ని అంశాలు తనిఖీ చేసి అడ్వాన్స్ ఇవ్వవచ్చా లేదా అనేది నిర్ణయిస్తారు. ఈపీఎఫ్ అడ్వాన్స్ క్లెయిమ్ ఇలా.. ఈపీఎఫ్ఓ పోర్టల్‌కి వెళ్లండి. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ పాస్‌వర్డ్‌ని నమోదు చేయండి. లాగిన్ చేయడానికి క్యాప్చా కోడ్‌ను టైప్ చేయండి. మీకు ఓపెన్ అయిన పేజీలో మీ బ్యాంక్ ఖాతా సమాచారాన్ని నమోదు చేసి, కొనసాగించడానికి "వ్యాలిడేట్" ఎంచుకోండి. ఈ సమాచారం మీ పీఎఫ్ ఖాతాకు లింక్ అవుతుంది. ఇప్పుడు, నిబంధనలు, షరతులను అంగీకరించడానికి "ఎస్"పై క్లిక్ చేయండి. ఆ తర్వాత "ఆన్‌లైన్ సర్వీసెస్" లింక్‌ని క్లిక్ చేసి, అనారోగ్యం కోసం క్లెయిమ్ ఫారమ్-31ని ఎంచుకోండి దీని తర్వాత, 'ప్రొసీడ్ ఫర్ ఆన్‌లైన్ క్లెయిమ్'పై క్లిక్ చేయండి. రోగి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయినట్లయితే, పీఎఫ్ ఉపసంహరణ సౌకర్యాన్ని పొందేందుకు ఒక ఉద్యోగి తప్పనిసరిగా 45 రోజులలోపు మెడికల్ బిల్లులను ఈపీఎఫ్ఓకి సమర్పించాలి. ప్రాసెస్ చేసిన తర్వాత, క్లెయిమ్ ఆమోదం కోసం యజమానికి ఇది వెళ్తుంది. సబ్‌స్క్రైబర్‌లు 'ఆన్‌లైన్ సర్వీస్' విభాగంలో 'క్లెయిమ్ స్టేటస్' ఎంపికను ఎంచుకోవడం ద్వారా మీ క్లెయిమ్ స్థితిని పర్యవేక్షించవచ్చు.

## ఏజెంట్లతో జాగ్రత్త సుమా? పెట్టుబడి పెట్టేముందు ఈ విషయాలు తెలుసుకోకపోతే నష్టపోతారు..

పెట్టుబడి పథకాలు మార్కెట్లో చాలానే ఉంటాయి. వాటిల్లో బెస్ట్ ఎంపిక చేసుకోవడం, దానిలో పెట్టుబడి పెట్టడం అనుకున్నంత సులభం కాదు. జాతీయ స్థాయిలో చాలా పథకాలు మనకు అందుబాటులో ఉంటాయి. వాటిని నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్(ఎన్ఎస్ఎస్) అని పిలుస్తారు. వీటిల్లో పెట్టుబడి పెట్టేందుకు కొంత మంది ఏజెంట్ల ఆశ్రయిస్తారు. వారి ద్వారా తమ పెట్టుబడులను డైవర్సిఫై చేస్తుంటారు. అయితే మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకోడానికి మీరు చేసే ఈ ప్రయత్నంలో మీరు విజయం సాధించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. ముఖ్యంగా ఏజెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టే వారు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి. అందుకే నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న టాప్ సేవింగ్స్ స్కీమ్స్, ఏజెంట్ ద్వారా వాటిల్లో పెట్టుబడులు పేట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్ రకాలు ఇవి.. నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, నేషనల్ సేవింగ్స్ స్కీమ్‌లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాలు ఇవి.. పోస్ట్ ఆఫీస్ సేవింగ్ అకౌంట్ నేషనల్ సేవింగ్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ నేషనల్ సేవింగ్ టైమ్ డిపాజిట్ అకౌంట్ జాతీయ పొదుపు నెలవారీ ఆదాయ ఖాతా సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కిసాన్ వికాస్ పత్ర పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ సుకన్య సమృద్ధి ఖాతా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు మీకు అధీకృత ఏజెంట్లు మీకు సహాయం చేస్తారు. అయితే వారిపై పూర్తిగా ఆధారపడటం మంచిది కాదు. ఏదైనా నిర్ణయాలు తీసుకునే ముందు మీ పరిశోధన చేయండి లేదా ఆర్థిక సలహాదారుని సంప్రదించండి నేషనల్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ లో ఏదైనా ఖాతా ను మీరు వ్యక్తిగతంగా పోస్టాఫీసు/బ్యాంక్ బ్రాంచ్‌ను సందర్శించడం ద్వారా డబ్బును స్వయంగా జమ చేయవచ్చు. కిసాన్ వికాస్ పత్ర, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి ఖాతా వంటి నిర్దిష్ట పథకాలకు ఆన్‌లైన్ డిపాజిట్లు చేసే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇప్పుడు ఏజెంట్ల ద్వారా పెట్టుబడి పెట్టే ముందు చేయాల్సిన, చేయకూడని అంశాలను పరిశీలిద్దాం. మొదటిగా ఏజెంట్ల సర్టిఫికెట్ ఆఫ్ అథారిటీ, ఏజెన్సీ చెల్లుబాటు తేదీని తనిఖీ చేయడం ద్వారా అధీకృత ఏజెంట్ల గుర్తింపును తెలుసుకోండి. దరఖాస్తు ఫారమ్‌ను మీరే పూరించండి. అయితే, ఏజెంట్ సహాయం/మార్గనిర్దేశం పొందవచ్చు. ఖాతా తెరవడం లేదా డిపాజిట్ చేయడం కోసం ఏజెంట్‌కు డబ్బు/పరికరాలు, పత్రాలను అందజేసేటప్పుడు ఏజెంట్ పూర్తి చేసిన అధీకృత రసీదులను అడగండి. ఈ రసీదు పుస్తకాలను ప్రభుత్వం ఏజెంట్లకు సరఫరా చేస్తుంది. ఖాతా మెచ్యూరిటీ అయ్యే వరకు కౌంటర్‌ఫాయిల్‌లను భద్రపరచండి. రసీదు



ఇవ్వడానికి ఏజెంట్ తిరస్కరిస్తే ఆ విషయాన్ని పోస్టల్/జిల్లా అధికారులకు నివేదించండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందినట్లు నిర్ధారించుకోండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందని పక్షంలో, అపాయింటింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయండిబీ ప్రాంతీయ డైరెక్టర్, నేషనల్ సేవింగ్స్ ఇన్స్టిట్యూట్‌బీ పోస్ట్‌మాస్టర్ కు ఫిర్యాదు చేయొచ్చు. పాస్‌బుక్‌లో పేర్కొన్న మొత్తం, తేదీ, స్టాంపు, సంతకం మొదలైన వాటి కచ్చితత్వాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత పోస్టాఫీసు నుంచి ధ్రువీకరించుకోండి. అనధికార వ్యక్తికి నగదును అందజేయవద్దు లేదా ఏజెంట్‌కు అనుకూలంగా చెక్కును జారీ చేయవద్దు. రూ. 10,000, అంతకంటే ఎక్కువ పెట్టుబడులకుబీ సంబంధిత పోస్ట్‌మాస్టర్‌కు అనుకూలంగా మాత్రమే చెక్కును జారీ చేయండి. మెచ్యూరిటీకి ముందు ఉపసంహరణ ఫారమ్‌ను పూరించవద్దు/సంతకం చేయవద్దు.

## ఇకపై జొమాటోలో ఆ సేవలు కూడా.. పేటీఎంతో రూ. 2వేల కోట్ల డీల్..




ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన సేవలను విస్తరిస్తోంది. కేవలం ఫుడ్ డెలివరీకి మాత్రమే పరిమితం కాకుండా ఇతర సేవలను సైతం యూజర్లకు అందిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జొమాటో యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. జొమాటో నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకొని పేమెంట్ కోసం ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకునే పనిలేకుండా నేరుగా జొమాటోలోనే పేమెంట్ చేసేందుకు గాను ఈ సేవలను తీసుకొచ్చినట్లు కంపెనీ ప్రకటించింది. ఇదిలా ఉంటే తాజాగా మరో కొత్త సర్వీస్‌ను జొమాటో పరిచయం చేసింది. జొమాటోలో ఇకపై టికెట్లు, ఈవెంట్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పేటీఎంతో జొమాటో డీల్ చేసుకుంది. పేటీఎంకు చెందిన మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను కొనుగోలు చేయనున్నట్టు జొమాటో ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ సెగ్మెంట్‌లోనూ సత్తా చాటేందుకు జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను 244.2 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్లు జొమాటో ప్రకటించింది. మన కరెన్సీలో చెప్పాలంటే సుమారు రూ. 2వేల కోట్లకు పైమాటే. కాగా ప్రస్తుతం ఈ రంగంలో బుక్‌మై షో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే లు, లైవ్ ఈవెంట్ల కోసం భారతదేశ ఆన్‌లైన్ టికెటింగ్ మార్కెట్‌లో పోటీనిచ్చేందుకే జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్లను విక్రయించే 'టికెట్ న్యూ' ప్లాట్‌ఫామ్‌తో పాటు లైవ్ ఈవెంట్లకు టికెట్లను నిర్వహించే 'ఇన్‌సైడర్' ప్లాట్‌ఫామ్‌ని విక్రయించడం ద్వారా తన మార్కెట్ వాటాను పేటీఎం జొమాటోకు అప్పగించనుంది. ఈ కొనుగోలుతో వచ్చే రెండేళ్లలో నాన్ కోర్ వ్యాపారాల్లో ఆదాయం మూడు రెట్లు పెరుగుతుందని తమ షేర్ హోల్డర్స్‌కి లెటర్‌లో పేర్కొంది.

## ఉచితంగా నెట్‌ఫ్లిక్స్ సేవలు పొందే అవకాశం.. స్పెషల్ రీఛార్జ్ ప్లాన్స్

టెలికం కంపెనీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో యూజర్లను ఆకర్షిస్తున్నాయి. ఇటీవల టెలికం కంపెనీలు రీఛార్జ్ ధరలను పెంచిన తర్వాత యూజర్లను అట్రాక్ట్ చేసే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగానే రకరకాల ఆఫర్లను అందిస్తున్నాయి. ముఖ్యంగా ఓటీటీ ప్లాట్‌ఫామల వినియోగం పెరిగిన తర్వాత వారిని టార్గెట్ చేసుకొని రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగానే పలు టెలికం సంస్థలు నెట్‌ఫ్లిక్స్‌ను ఉచితంగా అందించే ప్లాన్స్‌ను అందిస్తున్నాయి. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న కొన్ని బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1299 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే నెట్‌ఫ్లిక్స్‌ను ఉచింగా యాక్సెక్ చేసుకోవచ్చు. 84 రోజుల వ్యాలిడిటీ లభించే ఈ ప్లాన్ ద్వారా అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. మొత్తం 168 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 2 జీబీ డేటా పొందొచ్చు. ఇక జియో అందిస్తోన్న మరో బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1799 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులు వ్యాలిడిటీ లభిస్తుంది. రోజూ 3 జీబీ డేటా పొందొచ్చు. అలాగే అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా యాక్సెస్ చేసుకోవచ్చు. నెట్ ఫ్లిక్స్ ఉచితంగా పొందేలా వొడాఫోన్ ఐడియా రూ. 1198 రీఛార్జ్ ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ మొత్తం 70 రోజుల పాటు 2 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 140 జీబీ పొందొచ్చు. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. వొడాఫోన్ ఐడియా అందిస్తోన్న మరో బెస్ట్ ప్లాన్ రూ. 1599. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులపాటు వ్యాలిడిటీ లభిస్తోంది. ప్రతీ రోజూ 2.5 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 210 జీబీ డేటా లభిస్తుంది. ఇక ఉచిత నెట్‌ఫ్లిక్స్‌తో పాటు.. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. ఇక ఎయిర్ కూడా ఇలాంటి ఒక ప్లాన్‌ను అందిస్తోంది.ఎయిర్‌టెల్ తీసుకొచ్చిన రూ.1798 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ప్రతీ రోజూ 3 బీబీ డేటా చొప్పున మొత్తం 252 జీబీ డేటా పొందొచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లుపొందొచ్చు. అన్‌లిమిటెడ్ 5జీ డేటా లభిస్తుంది.



# వ్యాపారం

## పర్యాటకులకు శుభవార్త..

### ఈ దేశం భారత్ సహా 35 దేశాలకు వీసా రహిత యాక్సెస్





ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లాలంటే వీసా తప్పనిసరి కావాల్సిందే. అయితే ఇటీవల కాలం నుంచి కొన్ని దేశాలు ఎలాంటి వీసా లేకుండా అనుమతి ఇస్తున్నాయి. భారత్‌తో పాటు ఇతర దేశాలకు కొన్ని దేశాలు వీసా రహిత సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు పొరుగు దేశం శ్రీలంక శుభవార్త అందించింది. పొరుగు దేశం భారతదేశంతో సహా అనేక దేశాల నివాసితులకు వీసా రహిత ప్రాప్యతను ప్రకటించింది. ప్రకటన ప్రకారం, భారతీయ ప్రయాణికులు త్వరలో శ్రీలంకకు వీసా రహిత సదుపాయం పొందవచ్చు. 35 దేశాలు 6 నెలల పాటు ప్రయోజనం వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం, శ్రీలంక 35 దేశాలకు వీసా-రహిత యాక్సెస్ సౌకర్యాన్ని ప్రకటించింది. వాటిలో భారతదేశం, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఉన్నాయి. అక్టోబరు 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. 6 నెలల పాటు దీన్ని అమలు చేస్తున్నారు. ఈ మార్పును శ్రీలంక ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించింది. భారత్‌తో పాటు ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయోజనం శ్రీలంక పర్యాటక మంత్రి హరీన్ ఫెర్నాండోను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. అక్టోబర్ 1 నుండి 35 దేశాల నుండి వచ్చే ప్రయాణికులకు శ్రీలంకకు వెళ్లడానికి వీసా అవసరం లేదు. ఈ పాలసీ ఆరు నెలలపాటు ఉంటుంది. చైనా, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, స్పెయిన్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, పోలాండ్, కజకిస్తాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నేపాల్, ఇండోనేషియా, రష్యా, థాయిలాండ్‌తోపాటు భారతదేశం, అమెరికా, బ్రిటన్‌లు ఈ సదుపాయాన్ని పొందబోతున్నాయి. ఈ దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు కూడా సౌకర్యం.. మలేషియా, జపాన్, ఫ్రాన్స్, కెనడా, చెక్ రిపబ్లిక్, ఇటలీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, ఇజ్రాయెల్, బెలారస్, ఇరాన్, స్వీడన్, దక్షిణ కొరియా, ఖతార్, ఒమన్, బహ్రెయిన్, న్యూజిలాండ్ వంటి దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్లు కూడా వీసా రహిత యాక్సెస్‌ను పొందబోతున్నారు. భారతీయులు వీసా ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు పర్యాటకం చాలా ముఖ్యమైనది. ప్రతి సంవత్సరం వివిధ దేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించేందుకు వస్తుంటారు. కొద్ది రోజుల క్రితమే శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ ఫీజును పెంచి వివాదం సృష్టించారు. శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని ఒక విదేశీ కంపెనీ నిర్వహిస్తోంది. భారతదేశం, చైనా, జపాన్, రష్యా, మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా నుండి ప్రజలు ఎటువంటి రుసుము లేకుండా శ్రీలంకలో పర్యాటక వీసాలు పొందుతారు.

## దేశంలోని 540 నగరాల్లో టాటా ఛార్జింగ్ స్టేషన్లు.. ఈ కంపెనీలతో ఒప్పందం



టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి డెల్టా ఎలక్ట్రానిక్స్ ఇండియా, థండర్‌ప్లస్ సొల్యూషన్స్ అనే రెండు ప్రముఖ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సౌకర్యవంతంగా, అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యం పెట్టుకుంది టాటా. భారతదేశంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలలో ఒకటైన టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సంస్థ ఈ భాగస్వామ్యంలో 540 కొత్త ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు స్థాపించింది. తద్వారా ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఛార్జింగ్ కోసం ఆప్షన్లను పొందవచ్చు. అలాగే వారు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. 50కి పైగా నగరాల్లో ఛార్జింగ్ స్టేషన్లు: టాటా మోటార్స్ ఈ ఛార్జింగ్ పాయింట్ 50 కంటే ఎక్కువ నగరాల్లో ఇన్‌స్టాల్ కానున్నాయి. ఈ నగరాల్లో 540కి పైగా ఛార్జింగ్ స్టేషన్లు నిర్మించనున్నారు. టాటా మోటార్స్ ప్రకారం, ఈ ఛార్జింగ్ స్టేషన్ ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పూణె, కొచ్చి వంటి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. అలాగే, ఎక్కువగా ఉపయోగించే రూట్లలో ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించనున్నట్లు టాటా మోటార్స్ తన ప్రకటనలో తెలిపింది. తద్వారా కస్టమర్లు మరింత సౌలభ్యాన్ని పొందుతారు. ఈవీ వాహనాలకు మరింత ప్రోత్సాహాన్ని పొందుతారు. మీరు ఈ విధంగా ప్రయోజనం పొందుతారు. ఛార్జింగ్ సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉంటే, ఎక్కువ మంది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను అవలంబిస్తారు. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా దేశ ఇంధన భద్రతను కూడా పెంచుతుంది. అదనంగా, టాటా మోటార్స్ రాబోయే సంవత్సరాల్లో కొత్త ఈవీ మోడళ్లను విడుదల చేయడానికి తన ఈవీ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరింపజేస్తుందని, ఇది భారతీయ కస్టమర్ల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడుతుందని స్పష్టం చేసింది. ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడానికి ప్రాధాన్యత ఈ భాగస్వామ్యం ద్వారా టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడమే కాకుండా, స్థిరమైన, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దశ భారతదేశ ఈవీ పరిశ్రమ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, దేశం క్లీన్, గ్రీన్ ఎనర్జీ వైపు పయనించడంలో సహాయపడుతుందని కంపెనీ విశ్వసిస్తోంది.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా? అయితే కాసిన్ని ఖర్జూరాలు తినండి..



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెటిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.




# వీరికి సంజీవని ఈ పండు.. రోజూ ఒకటి తిన్నారంటే ఈ వ్యాధికి దీన్ని మించిన దివ్యౌషధం లేదు.!

రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది.మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



## కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట.. ఇక మీ ఇష్టం..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.



## కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..



ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమత్యుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

## మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్క్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

## గుండెల్లో మంట ఎక్కువైందా..? అయితే, ఈ 5హోం రెమెడీస్‌ని పాటించండి.!

గుండెల్లో మంట సమస్య జీర్ణవ్యవస్థకు సంబంధించినది. ఇది తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మరింత తీవ్రమవుతుంది. దీనిని హార్ట్ బర్న్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ అని కూడా పిలుస్తారు. దీని కోసం అనేక రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే మీరు ఇంట్లో కొన్ని సహజ పద్ధతుల ద్వారా హార్ట్ బర్న్ సమస్యను వదిలించుకోవచ్చు. ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని హోం రెమిడీస్తో మీరు గుండెల్లో మంట, అసౌకర్యాన్ని వదిలించుకోవచ్చు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం. ఆపిల్ సైడర్ వెనిగర్- యాపిల్ సైడర్ వెనిగర్ హార్ట్ బర్న్ నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. యాపిల్ సైడర్ వెనిగర్ రెండు టీస్పూన్లు ఒక గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగితే ఎసిడిటీ తొలగిపోయి బరువు కూడా అదుపులో ఉంటుంది. లవంగం గుండెల్లో మంట విషయంలో లవంగాలు కూడా చాలా ప్రయోజనకరంగా పనిచేస్తాయి. మీరు కూడా ఆహారం జీర్ణం కాలేదనే సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టయితే, రెండు లవంగాలను నోట్లో వేసుకుని చప్పరించవచ్చు. లవంగాల వినియోగం ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా నోటి దుర్వాసనను దూరం చేయడంలో కూడా ఇది చాలా మంచిది. సెలెరీ ఆకుల వినియోగం- మీరు గుండెల్లో మంటను వదిలించుకోవడానికి సెలెరీని(కొత్తిమీర వంటి ఆకుకూర) కూడా ఉపయోగించవచ్చు. దీన్ని ఒక గ్లాసు నీళ్లలో రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే తాగండి లేదా కషాయం చేసి కూడా తాగవచ్చు. ఈ రెండు పద్ధతులు మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను తొలగిస్తాయి. కలబంద రసంఅజీర్ణం,గ్యాస్, అసిడిటీ నుండి ఉపశమనం అందించడంలో కూడా కలబంద రసం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని కోసం మీరు దాని గుజ్జు నుండి రసం తయారు చేసితాగొచ్చు. ఇది మీజీవక్రియ రేటునుకూడా మెరుగుపరుస్తుంది. మజ్జిగ తాగాలిమజ్జిగ తీసుకోవడంవల్ల గుండెల్లో మంట నుండి ఉపశమనం పొందవచ్చు. ఇందులో ఉండే అసిడిక్ ఎలిమెంట్స్ అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ నుండి ఉపశమనం కలిగిస్తాయి. వేసవిలో దీనిని తీసుకోవడం ద్వారా మీ పొట్టను చల్లగా ఉంచుకోవచ్చు.

## పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి

పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్ఫరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు గింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టను శుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరొకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, శరీరంలోని టాక్సిన్స్‌ను కూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

# చరిత్రకు అడుగు దూరంలో విరాట్ కోహ్లీ

ఐపీఎల్ 2025లో విరాట్ కోహ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చాలా బాగా రాణిస్తోంది. విరాట్ కోహ్లీ జట్టుకు కెప్టెన్ కాకపోయినా జట్టు బాధ్యత ఇప్పటికీ ఆయన భుజాలపైనే ఉంది. విరాట్ కోహ్లీ కూడా ఈ బాధ్యతను చాలా బాగా నిర్వర్తిస్తున్నాడు. ఈ సీజన్‌లో కోహ్లీ మంచి దూకుడుతో బ్యాటింగ్ చేస్తున్నాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చూస్తుంటే చాలా త్వరగా టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయినట్లు అనిపిస్తుంది. ఇంతలో విరాట్ గొప్ప రికార్డుకు చాలా దగ్గరగా వచ్చాడు. కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం కీరన్ పొలార్డ్, పాకిస్తాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ రికార్డులను అధిగమించే అవకాశం ఉంది.
టీమిండియా, ఆర్సీబీ రన్ మెషీన్ విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడు. విరాట్ కోహ్లీ టీ20 క్రికెట్‌లో 412 మ్యాచ్‌లు ఆడాడు. ఈ కాలంలో విరాట్ కోహ్లీ 42.01 సగటు, 134.75 స్ట్రైక్ రేట్‌తో 13488 పరుగులు చేశాడు. అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ 5వ స్థానంలో ఉన్నాడు. అదే సమయంలో వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్ 13537 పరుగులతో నాల్గవ స్థానంలో, పాకిస్థాన్ జట్టుకు చెందిన షోయబ్ మాలిక్ 13571 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఇంకా ఐపీఎల్‌లో మూడు మ్యాచ్‌లు ఆడగలడు. ఈ జాబితాలో ఈ ఇద్దరు బ్యాటర్లను విరాట్ కోహ్లీ సులభంగా అధిగమించగలడు.కీరన్ పొలార్డ్‌ను అధిగమించడానికి విరాట్ కోహ్లీకి 50 పరుగులు, షోయబ్ మాలిక్‌ను అధిగమించడానికి 84 పరుగులు అవసరం. విరాట్ కోహ్లీ ప్రస్తుత ఫామ్‌ను చూస్తే ఈ లక్ష్యం విరాట్ కోహ్లీకి చాలా సులభం అనిపిస్తుంది. విరాట్ కోహ్లీ మే 29న పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగే ఐపీఎల్ మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆడతాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మంచి ఇన్నింగ్స్ ఆడితే వారిద్దరినీ అధిగమించే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఏ భారతీయుడు ఈ స్థానాన్ని



సాధించలేకపోయాడు. విరాట్ కోహ్లీ అలా చేసిన మొదటి భారతీయుడు అవుతాడు. పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ మరో 30 పరుగులు చేస్తే ఆ జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్ జట్టుపై విరాట్ కోహ్లీ 1104 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఈ రికార్డు ఆస్ట్రేలియా దిగ్గజం డేవిడ్ వార్నర్ పేరిట ఉంది. డేవిడ్ వార్నర్ పంజాబ్ కింగ్స్ జట్టుపై 1134 పరుగులు చేశాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన డేవిడ్ వార్నర్ రికార్డును సమం చేసేందుకు విరాట్ కోహ్లీ అడుగుదూరంలో నిలిచాడు. ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అర్ధ శతకం సాధిస్తే డేవిడ్ వార్నర్ సరసన చేరుతాడు. విరాట్ కోహ్లీ ఈ ఐపీఎల్ సీజన్లో ఇప్పటివరకు 8 హాఫ్ సెంచరీలు చేశాడు. 2016 ఐపీఎల్ సీజన్లో డేవిడ్ వార్నర్ 9 ఫిఫ్టీలు సాధించాడు.విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2025లో 13 ఇన్నింగ్స్‌లలో 60.20 సగటు, 147.91 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 602 పరుగులు చేశాడు. ఈ సారి ఆర్సీబీ విజయంలో విరాట్ కోహ్లీ చాలా కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ ఫైనల్ వరకు ఈ ఫామ్‌ను కొనసాగించాలనుకుంటున్నాడు. ఐపీఎల్ 2025లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ గెలుచుకునే రేసులో కూడా ఉన్నాడు.

## విరాట్‌కు ఏది ఉత్తమమో తెలుసు

### మాజీ ప్లేయర్ హర్భజన్ సింగ్

టీమ్‌ఇండియా సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ టెస్టు రిటైర్మెంట్ ప్రకటనతో యావత్ క్రికెట్ ప్రపంచం షాక్?కు గురైంది. అకస్మాత్తుగా ఎందుకు రిటైర్ అయ్యాడని మాజీలు సైతం ఆశ్చర్యపోయారు. అయితే విరాట్ నిర్ణయం క్రికెట్ ఫ్యాన్స్?తోపాటు మాజీ ప్లేయర్ హర్భజన్ సింగ్ 8ఏళ్ల కూతురు హినయాను కూడా బాధించిందట! అవును, ఈ విషయాన్ని భజ్జీనే స్వయంగా వెల్లడించాడు. ఇటీవల బాలీవుడ్ మీడియాతో మాట్లాడిన హర్భజన్, విరాట్?తో? జరిగిన సంభాషణను రివీల్ చేశాడు.టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం తాను విరాట్ కోహ్లీతో మాట్లాడినట్లు చెప్పాడు. ఎందుకు ఇలా చేశావు అని కూడా అడిగానని అన్నాడు. అయితే ఇదే విషయంపై తన కూతురూ కూడా మాట్లాడిందట. 'డాడీ, విరాట్ ఎందుకు రిటైర్ అయ్యాడు' అంటూ తనను అడిగిందట. అంతటితో ఆగకుండా, తనే స్వయంగా విరాట్?కు మెసేజ్ చేసిందని భజ్జీ చెప్పాడు.'నేను విరాట్?ను అడిగాను, ఎందుకిలా చేశావని. అయితే విరాట్ ఎందుకు రిటైర్ అయ్యాడని నా కూతురు హినయ నన్ను ప్రశ్నించింది. అలాగే ఏకంగా విరాట్?కే మెసేజ్ చేసింది. 'దిస్ ఈజ్ హినాయ. విరాట్, నువ్వు ఎందుకు రిటైర్ అయ్యావు?' అని అడిగింది, దీనికి విరాట్ కూడా స్పందించాడు. 'బేటా, ఇట్స్ టైం' అని రిప్లై ఇచ్చాడు. విరాట్?కు ఏది ఉత్తమమో తెలుసు' అని హర్భజన్ పేర్కొన్నాడు.అలాగే టీమ్‌ఇండియా కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గురించి కూడా హర్భజన్ మాట్లాడాడు. ఇది సరైన ఎంపికేనని అన్నాడు. కానీ, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేని ఇంగ్లాండ్ పర్యటన యువ భారత్?కు కఠిన సవాల్ విసురుతుందని చెప్పాడు. 'ఇంగ్లాండ్ టూర్? కఠిన సవాళ్లతో కూడుకున్నది. రోహిత్, విరాట్ లేకండా సిరీస్ నెగ్గడం యువ జట్టుకు అంత ఈజీ కాదు. అయితే కొందరికి నేనిచ్చే సలహా ఏంటంటే, పర్యటన ఇంకా ప్రారంభం కాలేదు. అందుకే ఇప్పుడే ఓ అంచనాకు రాకూడదు. ఒకవేళ మ్యాచుల్లో ఓడినా ఫర్వాలేదు. ఎందుకంటే వారు నేర్చుకుంటారు. కానీ గిల్, పంత్ బృందం అద్భుతంగా ఆడుతుందని అనుకుంటున్నా' అని భజ్జీ వ్యాఖ్యానించాడు.




## నాలుగోసారి ఫైనల్లో ఆర్సీబీ.. ఈ సాలా కప్ నమదే..!

ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి ఆ జట్టు ఫేవరెట్. స్వదేశీ స్టార్లు, విదేశీ హిట్టర్లు.. ఇలా జట్టునిండా మ్యాచ్ విన్నర్లే. మూడుసార్లు ఫైనల్ చేరినా.. 17 ఏళ్లుగా ఆ జట్టుకు ట్రోఫీ మాత్రం ఇప్పటికీ అందని ద్రాక్షనే. 'ఈ సాలా కప్ నమదే' స్లోగన్‌తో ప్రతి ఎడిషన్‌లో ఆడే ఆ టీమ్ కల.. అందరి అభిమానులు కల సాకారమయ్యే రోజు రాబోతోంది. 18వ ఎడిషన్‌లో అంచనాలకు మించి రాణించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్లో అడుగు పెట్టింది. గురువారం జరిగిన క్వాలిఫయర్ 1లో టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌ను చిత్తుగా ఓడించి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. తమ ఫేవరెట్ టీమ్ ఈసారి కప్ కొట్టడం పక్కా అని సంబురాల్లో మునిగిపోతున్నారు ఆర్సీబీ ఫ్యాన్స్. ఐపీఎల్ చరిత్రలో ఆర్సీబీ ఒక విఫలమైన జట్టు. అందరూ ప్రతిభావంతులే ఉన్నా సరే ఎందుకనో బెంగళూరును దురదృష్టం వెంటాడుతూ వచ్చేది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు మూడు సార్లు (2009, 2011, 2016) ఫైనల్లోనూ పరాజయమే పలకరించింది. రన్నరప్ అనే పేరుతోనే సరిపెట్టుకుంది. టీమిండియాను టెస్టుల్లో నంబర్ 1గా నిలిపిని విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నా సరే బెంగళూరు ట్రోఫీ కరువు తీర్చలేకపోయాడు. 17వ సీజన్‌కు ముందే సారథిగా వైదొలిగిన విరాట్.. బ్యాటర్‌గా జట్టుకు మరింత ఉపయోగపడాలనుకున్నాడు. అనుకున్నట్టే 18వ సీజన్‌లో ఆర్సీబీ విజయాల్లో 8 అర్ధ శతకాలు, 602 రన్స్ కీలక పాత్ర పోషించాడీ రన్ మెషీన్.

## ఏంచేసినా పంజాబ్‌ని మాత్రం ఓడించలేరు!

### మాథ్యూ హేడెన్ కీలక వ్యాఖ్యలు

ముఖ్యమైన క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడేందుకు సిద్ధంగా ఉన్న పంజాబ్ కింగ్స్ జట్టు, 11 సంవత్సరాల తర్వాత తొలిసారి ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెడుతోంది. ఈ భారీ పోరుకు ముందు పంజాబ్ కింగ్స్ విజయంపై చాలా మంది విశ్లేషకులు విశ్వాసం వ్యక్తం చేస్తుండగా, ప్రముఖ క్రికెట్ కామెంటేటర్, ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కింగ్స్ జట్టు ప్రస్తుతం అత్యుత్తమ సమన్వయంతో ఆడుతోందని, వారి బ్యాటింగ్, బౌలింగ్ లైనప్స్ రెండూ సమతుల్యంగా ఉండటమే విజయాలకు కారణమని హేడెన్ అభిప్రాయపడ్డాడు. హేడెన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియాకు రాసిన కాలమ్‌లో, పంజాబ్ జట్టు ఇప్పుడు ఉత్సాహంతో కాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో క్వాలిఫయర్ మ్యాచ్‌కు అడుగుపెడుతోందని పేర్కొన్నాడు. ముఖ్యంగా ఢిల్లీపై పొందిన గెలుపు, పంజాబ్ సీజన్‌లోని మిగిలిన జట్లతో పోలిస్తే అత్యుత్తమ ప్రదర్శన చూపించిందని హేడెన్ స్పష్టం చేశాడు. "వారి ఓపెనర్లు చాలా ప్రభావవంతంగా ఆడుతున్నారు, బౌలింగ్ యూనిట్ ఫామ్‌లో ఉంది, జట్టు మొత్తం సమర్థవంతంగా ముందుకెళ్తోంది" అంటూ హేడెన్ ప్రశంసలు కురిపించాడు. పంజాబ్‌ను వెనక్కి నెట్టడం నిజంగా చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇక శ్రేయస్ అయ్యర్ నాయకత్వాన్ని కూడా హేడెన్ ప్రత్యేకంగా ప్రశంసించాడు.

# ఎస్ఆర్‌హెచ్ నుంచి 5గురు ఔట్..

ఐపీఎల్ 2025 సీజన్ ముగిసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిరాశాజనకమైన ప్రదర్శన తర్వాత, 2026 మెగా వేలానికి ముందు జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జట్టు కూర్పును బలోపేతం చేసుకోవడానికి, కొంతమంది ఆటగాళ్లను విడుదల చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించని లేదా అధిక ధర పలికిన ఆటగాళ్లను రిలీజ్ చేసే అవకాశం ఉంది. పీఎల్ 2025 వేలంలో షమీని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 10 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలు, గత సీజన్‌లో పేలవమైన ప్రదర్శన కారణంగా అతను ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. 9 మ్యాచ్‌లలో 6 వికెట్లు మాత్రమే తీసి, 11.23 ఎకానమీ రేటుతో పరుగులు సమర్పించుకున్నాడు. అతని అధిక ధర, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా, %ూ=ఎ% అతనిని విడుదల చేసి, యువ భారతీయ పేసర్లపై పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపాను %ూ=ఎ% రూ. 2.40 కోట్లకు కొనుగోలు చేసింది. స్పిన్ విభాగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో జంపాను తీసుకున్నప్పటికీ, అతను ప్రభావం చూపలేకపోయాడు. 2025లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడి,



8 ఓవర్లలో 94 పరుగులు ఇచ్చి 2 వికెట్లు మాత్రమే తీశాడు. అతను త్వరగా గాయపడటం, అతని పేలవమైన ఫామ్ జట్టుకు భారంగా మారాయి. తీష్ కుమార్ రెడ్డిని %ూ=ఎ% రూ. 8 కోట్లకు అట్టిపెట్టుకుంది. అతను గత సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, 2025 సీజన్‌లో మాత్రం నిలకడగా రాణించలేకపోయాడు. బ్యాటింగ్‌లో 11 మ్యాచ్‌లలో 178 పరుగులు మాత్రమే చేసి, బంతితో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అతని అధిక రిటెన్షన్ ధరను పరిగణనలోకి తీసుకుంటే, జట్టు బలోపేతం కోసం నితీష్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ ను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 11.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, అతను 2025 సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో సెంచరీ మినహా, మిగిలిన మ్యాచ్‌లలో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. అతని అధిక ధర, అస్థిరమైన ఫామ్ కారణంగా, %ూ=ఎ% అతనిని విడుదల చేసి, కొత్త ఓపెనింగ్ లేదా వికెట్ కీపింగ్ ఆప్షన్ కోసం వెతికే అవకాశం ఉంది.బ్యాట్స్‌మెన్ అభినవ్ మనోహర్‌ను %ూ=ఎ% రూ. 3.2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 2025 సీజన్‌లో 7 మ్యాచ్‌లలో కేవలం 61 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మధ్యకాలంలో అతని ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. కాబట్టి, సన్‌రైజర్స్ హైదరాబాద్ అతని స్థానంలో మెరుగైన ప్రత్యామ్నాయాలను అన్వేషించే అవకాశం ఉంది.ఈ ఆటగాళ్లను విడుదల చేయడం ద్వారా %ూ=ఎ% తమ పర్స్‌ను పెంచుకొని, 2026 మెగా వేలంలో జట్టును మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా భారతీయ బౌలర్లు, ఆల్‌రౌండర్లపై దృష్టి సారించే అవకాశం ఉంది.



## ధోనీ సరైన మూడ్‌లో లేకపోతే మాట్లాడడానికి ఆలోచిస్తా

### ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆసక్తికర వ్యాఖ్యలు


చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ ఐపీఎల్?లో ప్లేఆఫ్స్?కు చేరడంలో విఫలమైంది. పేలవ ప్రదర్శనతో ఆ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. లీగ్ మధ్యలో లెజెండరీ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ జట్టు పగ్గాలు చేపట్టినా, చెన్నై ఆటతీరు మారలేదు. ఈ క్రమంలో ధోనీ నాయకత్వంపై ఆ జట్టు స్టార్ ఆల్?రౌండర్ రవీంద్ర జడేజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రీసెంట్?గా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఛానెల్? పాడ్?కాస్ట్?లో మాట్లాడిన జడ్డూ, ధోనీని తొలిసారి కలిసిన సందర్భం, అతడి కెప్టెన్సీ గురించి కొన్ని విషయాలు షేర్ చేసుకున్నాడు.'ధోనీని నేను 2005లో తొలిసారి చెన్నైలో కలిశాను. అప్పుడు ఛాలెంజర్స్ ట్రోఫీ జరుగుతుంది. అప్పుడు నేను ఫ్లైట్?లో ముంబయి నుంచి వస్తున్నాను. అదే విమానంలో ధోనీ కూడా ఉన్నాడు. అయితే నాది ఎకానమీ క్లాస్, తనది బిజినెస్ క్లాస్. అయితే ధోనీ ఈ విమానంలో ఉన్నాడంటూ అక్కడ అందరూ మాట్లాడుకున్నారు. కానీ నేను అతడిని కలవడానికి సంకోచించాను. ఇప్పటికీ ధోనీ సరైన మూడ్?లో లేకపోతే నేను తనతో మాట్లాడడానికి ఆలోచిస్తాను. అతడు ఏమీ అనడు. కానీ, తాను మాట్లాడే మూడ్?లో లేడని ధోనీ ముఖం చూస్తే తెలిసిపోతుంది'అని జడేజా చెప్పుకొచ్చాడు.అలాగే ధోనీని తొలిసారి కలిసినప్పుడు ఏం జరిగిందో కూడా జడేజా వివరంగా చెప్పాడు. అప్పుడు ధోనీ ఫోన్ పోయిందట. అలా జరగడం వల్ల ధోనీ నుంచి తాను తప్పించుకున్నానని అన్నాడు. 'విమానంలో ధోనీని చూసినప్పుడు, నేను చిన్నవాడిని. అప్పుడు అతడు పొడవైన జుట్టుతో ఉన్నాడు. ఇక ఎయిర్?పోర్ట్?లో దిగాక, మేమంతా ధోనీతో కలిసి హోటల్‌కు వెళ్లాలని మా మేనేజర్ చెప్పాడు. అంతే నాకు కాస్త బెరుకుగా అనిపించింది. నేను ధోనీతో ఎలా వెళ్లాలి అనుకున్నా. ఎంతైనా అతడు ధోనీ అని చాలా ఆలోచించా''కానీ, అదృష్టవశాత్తూ అప్పుడే ధోనీ తన ఫోన్‌ను పారేసుకున్నాడు. దాని కోసం అతడు అక్కడే వెయిట్ చేస్తున్నాడు. అతడిని తప్పించుకొని అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ఇదే కరెక్ట్ టైమ్ అని అనుకున్నా. మరి ఆ సమయంలో నేను ధోనీతో ఏం మాట్లాడాలి? అని ఆలోచించేవాణ్ని' అని జడేజా తొలిసారి ధోనీని కలిసిన సందర్భంగా గురించి చెప్పాడు.నీ తన పర్సనల్ రికార్డ్స్ గురించి మాట్లాడడం నేనెప్పుడూ వినలేదు. అతడు పర్సనల్ రికార్డ్స్ కోసం కాదు, జట్టు కోసమే ఆడుతాడు. 'ధోనీ పర్సనర్ రికార్డ్స్ గురించి మాట్లాడడం నేనెప్పుడూ వినలేదు. తను సెంచరీ, హాఫ్ సెంచరీల గురించి అస్సలు ఆలోచించడు. ఎల్లప్పుడూ జట్టులోని 10 మంది గురించే ఆలోచిస్తాడు' అని జడ్డూ పేర్కొన్నాడు.కాగా, ధోనీ- జడేజా అటు టీమ్‌ఇండియా, ఇటు ఐపీఎల్?లో చాలా ఏళ్లపాటు కలిసి ఆడారు. ధోనీ కెప్టెన్సీలో జడేజా టీమ్‌ఇండియాతో పాటు, చెన్నై జట్టు డ్రెస్సింగ్ రూమ్ షేర్ చేసుకున్నాడు. ధోనీ కెప్టెన్సీలో చెన్నై ఐదుసార్లు ఛాంపియన్?గా నిలిచింది. కానీ, ఈసారి పేలవ ప్రదర్శన వల్ల లీగ్ దశలోనే నిష్క్రమించింది.

## శ్రేయస్‌కు తీవ్ర అన్యాయం

### మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్

ఇంగ్లాండ్ పర్యటన కోసం ఎంపిక చేసిన భారత జట్టుపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది ప్లేయర్లను ఎంపిక చేయకపోవడం, సర్ప్రైజింగ్ గా మరికొంతమందిని ఎంపిక చేయడం విచిత్రంగా ఉంది. అసలు ఆటగాళ్లను ఇంత ముఖ్యమైన పర్యటనకు ఏ బేస్ పై ఎంపిక చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా అటు దేశవాళీల్లోనూ, ఇటు వన్డేల్లో, ఐపీఎల్లో చక్కగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్ ను పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. అన్ని ఫార్మాట్లలో శ్రేయస్ బాగా ఆడుతున్నాడని, అలాంటి ఆటగాడిని పక్కన పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నాడు. ఇక ఏ గణాంకాలు తీసుకుని శ్రేయస్ ను పక్కన పెట్టారని అడుగుతున్నాడు. అదే సమయంలో జట్టులోకి నూతనంగా ఎంపికైన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ పై చర్చను లెవనెత్తాడు. నిజానికి సుదర్శన్ చాలా మంచి ఆటగాడని, ఐపీఎల్లో సత్తా చాటి ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడని కైఫ్ గుర్తు చేశాడు. కేవలం ఐపీఎల్ ప్రదర్శనే ఇంగ్లాండ్ టూరుకు గీటురాయిగా తీసుకోవద్దని, అతని రెడ్ బాల్ ఫార్మాట్ ప్రదర్శనను కూడా చూడాలని హితవు పలికాడు. ఒకవేళ ఐపీఎల్ ప్రదర్శనే గీటురాయి అనుకుంటే శ్రేయస్ కూడా బాగా రాణించాడని, అటు పంజాబ్ కెప్టెన్ గా వ్యవహరించి, 11 ఏళ్ల తర్వాత ప్లే ఆఫ్స్ కు తీసుకొచ్చిన విషయాన్ని స్పష్టం చేశాడు. అసలు సెలెక్టర్లు ఏ బేసిస్ పై ఆటగాళ్లను ఎంపిక చేస్తున్నారని ప్రశ్నించాడు. బీసీసీఐ, సెలెక్టర్లు ద్వంద్వ వైఖరితో నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టాడు.ఇక 11 ఏళ్ల తర్వాత ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు క్వాలిఫై అవడంపై పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయస్ ఆనందం వ్యక్తం చేశాడు. ముఖ్యంగా హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తనకు కావాల్సినంత ఫ్రీడమ్ ఇవ్వడంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నాడు. నిర్ణయాలను సొంతంగా తీసుకునే స్వేచ్ఛను ఇచ్చాడని, దీంతో తను చాలా ఫ్రీగా పని చేశానని పేర్కొన్నాడు.

# విశ్వజ



## జిడ్డు చర్మానికి గుడ్ బై..వేసవిలో మెరిసే చర్మం కోసం 5 టిప్స్..

### హాయ్ హ్యాండ్సమ్ అనాల్సిందే

ఎండాకాలంలో అధిక వేడితో పాటుగా మరికొన్ని సమస్యలను కూడా తీసుకొస్తుంది. జిడ్డే చర్మం ఉన్నోళ్లు ఈ సీజన్ లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. పెరిగిన ఉష్ణోగ్రతలు, అధిక చెమట కారణంగా ముఖ చర్మంపై నూనె గ్రంథులు మరింత చురుగ్గా పనిచేస్తాయి. ఫలితంగా అదనపు నూనె చర్మంపై పేరుకుపోయి ముఖం జిగటగా, నిర్జీవంగా కనిపిస్తుంది. ఇది మాత్రమే కాకుండా మొటిమలు, బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ వంటి చర్మ సమస్యలు కూడా ఈ కాలంలో అధికంగా వేధిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో మన చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం అత్యవసరం. వేసవి తాపానికి మీ చర్మం బలికాకుండా రోజంతా ఫ్రెష్ గా, కాంతివంతంగా మెరిసిపోవాలంటే ఏం చేయాలో ఇక్కడ చూడండి. తేలికపాటి ఫేస్ వాష్ తో క్లీన్ వేసవిలో మీ ముఖాన్ని రోజుకు కనీసం రెండు మూడు సార్లు కఠినమైన రసాయనాలు లేని, తేలికపాటి ఫేస్ వాష్ తో శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇది చర్మం పొడిబారకుండా కాపాడుతూనే ముఖంపై పేరుకుపోయిన అదనపు నూనె, దుమ్ముధూళి, మలినాలను సమర్థవంతంగా తొలగిస్తుంది. సబ్బు ఆధారిత ఫేస్ వాష్ లకు బదులుగా జెల్ లేదా ఫోమ్ ఆధారిత క్లెన్సర్‌లను ఎంచుకోవడం ఉత్తమం. ముఖ్యంగా సాలిసిలిక్ యాసిడ్ లేదా వేప, తులసి వంటి సహజ పదార్థాలు కలిగిన ఫేస్ వాష్ లు జిడ్డు చర్మానికి అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఇవి చర్మ రంధ్రాలను శుభ్రపరిచి, మొటిమలు రాకుండా నివారిస్తాయి. రోజ్ వాటర్, నిమ్మకాయతో సహజ టోనర్ జిడ్డు చర్మం సమస్యను అధిగమించడానికి ఇంట్లోనే ఒక సహజసిద్ధమైన టోనర్‌ను తయారు చేసుకోవచ్చు. ఒక టీస్పూన్ స్వచ్ఛమైన రోజ్ వాటర్‌లో నాలుగైదు చుక్కల తాజా నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని ఒక దూది ఉండ సహాయంతో ముఖం, మెడపై నెమ్మదిగా అప్లై చేయండి. రోజ్ వాటర్ చర్మానికి చల్లదనాన్ని అందించి ఉపశమనం కలిగిస్తే, నిమ్మరసంలోని ఆమ్ల గుణాలు అదనపు నూనెను నియంత్రించి చర్మాన్ని ఫ్రెష్ గా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. అయితే నిమ్మరసం పడని వారు దీనిని వాడకపోవడం మంచిది లేదా బాగా పలుచన చేసి వాడాలి. నూనె రహిత, జెల్ ఆధారిత మాయిశ్చరైజర్ చాలా మంది జిడ్డు చర్మం ఉన్నవారు మాయిశ్చరైజర్ వాడటానికి వెనుకాడతారు.. దీనికి కారణం ఏంటంటే అది చర్మాన్ని మరింత జిడ్డుగా మారుస్తుందని అపోహ పడతారు. వాస్తవానికి ప్రతి చర్మ రకానికి హైడ్రేషన్ చాలా అవసరం. హైడ్రేషన్ లేకపోవడం వల్ల చర్మం పొడిబారి మరింత ఆయిల్ ని ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి ఆయిల్ లేని, నీటి ఆధారిత లేదా జెల్ ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకోండి. %ఖాశీషవతీవఝ దీఎ% ఒక్క ఫ్లోర్ మెట్లు ఎక్కగానే రొప్పుతున్నారా? డాక్టర్ చెప్పిన ఈ షాకింగ్ నిజం తెలిస్తే..వీడియో చూడండి ముల్తానీ మట్టితో అదనపు ఆయిల్ కి చెక్ ముల్తానీ మట్టి.. జిడ్డు చర్మం ఉన్నవారికి ఒక వరం లాంటిది.

## కీర దోస వర్సెస్ పుచ్చకాయ

## ఈ సమ్మర్‌లో మీ శరీరాన్ని ఏది వేగంగా చల్లబరుస్తుంది?



రెండు రోజుల నుంచి తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల వర్షాల కారణంగా ఎండలు కొంచెం తగ్గుముఖం పట్టాయి కానీ అనేక ప్రాంతాల్లో ఇంకా ఎండలు మండిపోతున్నాయి. అయితే ఈ మండే ఎండల్లో బయటకు వెళ్లారంటే మాత్రం దిమ్మ తిరిగి బొమ్మ కనబడటం గ్యారెంటీ. డీహైడ్రేషన్ అలసట, తలతిరగడం వంటి అనేక సమస్యలు ఈ సీజన్ లో చాలా కామన్. అయితే ఈ సమయంలో మన శరీరానికి చల్లదనాన్ని, తగినంత నీటి శాతాన్ని అందించడంలో పుచ్చకాయ, కీర దోసకాయ కీలక పాత్ర పోషిస్తాయి. వీటిని సమ్మర్ సూపర్ ఫుడ్స్‌గా అభివర్ణిస్తుంటారు. కీర దోసకాయలో నీరు పుష్కలంగా ఉంటది,పుచ్చకాయైతే నీటితో పాటు అనేక పోషకాలను కూడా కలిగి ఉంటుంది. కాబట్టి కొందరు సమ్మర్ లో దోపకాయ కన్నా పుచ్చాకాయే ఆరోగ్యానికి మంచిదని..ఇంకొందరు పుచ్చకాయ తియ్యగా ఉంటుందని, దానివల్ల బరువు పెరుగే అవకశముంది కాబట్టి దోపకాయనే బెటర్ అరి అంటుంటారు. అసలు సమ్మర్ లో ఆరోగ్యారి ఏది ఎక్కువ మేలు చేస్తుంది..దోసకాయ,పుచ్చకాయలో ఏది బెటరో ఇప్పుడు చూద్దాం.

దోసకాయ పుచ్చకాయ-ఇదే బెస్ట్

దోసకాయలో దాదాపు 96% నీరే ఉంటుంది. కేలరీలు చాలా తక్కువ. ఫైబర్, విటమిన్ , పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇది తినడం వల్ల జీర్ణవ్యవస్థను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. శరీరానికి చల్లదనాన్ని అందించి, వేడిని సమతుల్యం చేస్తుంది. చర్మానికి చల్లదనాన్ని ఇచ్చి, టానింగ్, దురద వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీని రసాన్ని ముఖానికి రాసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. పుచ్చకాయలో 92% నీరు ఉంటుంది. దీంతో పాటు లైకోపీన్, విటమిన్ సి, విటమిన్ ఏ, బీటా కెరోటిన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా, చర్మానికి తేమను అందిస్తుంది. గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దీనిలోని సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇందులోని విటమిన్ సి చర్మ సౌందర్యాన్ని కాపాడటమే కాకుండా, జుట్టు పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది.

నిపుణులు ఏమంటున్నారు?

బరువు తగ్గాలనుకునేవారికి దోసకాయ బెస్ట్ ఆప్షన్ అని నిపుణులు తెలిపారు. ఇది తినడం వల్ల కడుపు నిండిన భావన కలిగించి, ఆకలిని తగ్గిస్తుంది. పుచ్చకాయ కూడా ఆరోగ్యకరమైనదే అయినా ఇందులో ఉండే సహజ చక్కెరల వల్ల అధికంగా తీసుకుంటే బరువు పెరిగే అవకాశం ఉంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో రెండూ సమర్థవంతమైనవే అయినా పుచ్చకాయ తక్షణ శక్తిని, నీటిని ఏకకాలంలో అందించగలదు. ముఖ్యంగా ఎండలోంచి అలసిపోయి వచ్చినప్పుడు చల్లటి పుచ్చకాయ ముక్కలు తింటే కలిగే ఉపశమనం అంతా ఇంతా కాదు. దోసకాయను రోజంతా అప్పుడప్పుడు స్నాక్ గా తీసుకోవడం మంచిది. దోసకాయలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపును శుభ్రం చేసి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి దోసకాయ మరింత ప్రయోజనకరం. పుచ్చకాయ కూడా తేలికగా జీర్ణమైనప్పటికీ కొందరిలో అధికంగా తింటే గ్యాస్ లేదా అసిడిటీ సమస్యలు తలెత్తవచ్చు. వేసవిలో దోసకాయ, పుచ్చకాయ రెండూ ప్రయోజనకరమైనవే. బరువు నియంత్రణలో ఉంచుకుంటూ రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండాలనుకునేవారికి దోసకాయ మంచిది. తక్షణ శక్తి, పోషకాలు, అదనపు హైడ్రేషన్

## బీపీ టాబ్లెట్స్ వేసుకున్నా బీపీ తగట్లేదా? ఇలా చెయ్యండి!

ప్రస్తుత సమాజంలో ఇంటికి ఒకరైనా బీపీతో బాధపడుతున్నారు. హైబీపీ బారినపడి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు బీపీ టాబ్లెట్ వేసుకోవాల్సిన పరిస్థితి చాలా ఇళ్ళల్లో కనిపిస్తుంది. అయితే చాలామందికి బీపీ టాబ్లెట్ వేసుకున్న తర్వాత కూడా బీపీ తగ్గడం లేదని చెబుతూ ఉంటారు. అటువంటివారు బీపీని నేచురల్ గా కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి. బీపీ ని కంట్రోల్ చేసుకోవడం కోసం చేయవలసింది ఏమిటి అనేది ప్రస్తుతం తెలుసుకుందాం.

బీపీ కంట్రోల్ కావాలంటే ఇలా చెయ్యండి

బిపి ని కంట్రోల్ చేసుకోవడం కోసం ముందు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. మంచి ఆహారాన్ని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి ఆహారాన్ని తీసుకోవాలి. బీపీని కంట్రోల్ చేసుకోవడానికి మనం తీసుకునే ఆహారంలో ఉప్పును తగ్గించాలి. అధిక ఉప్పు, కారం వినియోగం వల్ల బీపీ కంట్రోల్ కాదు. ఇక బిపి కంట్రోల్ చేయడం కోసం ప్రతిరోజూ తప్పనిసరిగా శారీరక వ్యాయామం చేయాలి. ఇవి కంట్రోల్ చేస్తే బీపీ కంట్రోల్ అవుతుంది రోజు కనీసం ఒక అరగంట పాటైనా యోగా, ధ్యానం వంటివి చేయాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. వీటివల్ల కూడా సహజంగా బీపీ తగ్గే అవకాశం ఉంటుంది. ఇక బీపీని కంట్రోల్ చేసుకోవడానికి ధూమపానం, మద్యపానం వంటివి మానేయాలి. ధూమపానం, మద్యపానంతో బిపి మరింత పెరుగుతుంది. కనుక వీటిని మానేయడం మంచిది. విపరీతంగా బరువు పెరిగిన వారిలోనూ బీపి కంట్రోల్ చేయడం కష్టమవుతుంది. కనుక బరువు తగ్గడంపైన దృష్టి సారించాలి.



టెన్షన్స్ తగ్గించుకోండి

అంతేకాదు ఆందోళన, ఒత్తిడి వంటివి బీపీని బాగా పెంచుతాయి. టెన్షన్స్ ఎక్కువగా ఉంటే హైపర్ టెన్షన్ పెరుగుతుంది. కనుక వాటిని తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. సరిగ్గా నిద్రపోని వారిలో కూడా బీపీ బాగా పెరుగుతుంది. కనుక ప్రతిరోజు కచ్చితంగా ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలి.

బీపీని నిర్లక్ష్యం చెయ్యొద్దు

ఇక ఈ నియమాలన్నీ పాటించినప్పటికీ బీపీ తగ్గకపోతే మరోమారు వైద్యుని వద్దకు వెళ్లి సలహా తీసుకొని మందులు వాడాలి. బీపీని ఏం కాదులే అని నిర్లక్ష్యం చెయ్యకూడదు. నిర్లక్ష్యం చేస్తే అది పక్షవాతానికి, శరీరంలోని ముఖ్య అవయవాల డ్యామేజ్ కు దారి తీయవచ్చు.

# మార్కెట్

## లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 320 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో పుంజుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,591.03 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,106.98 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,816.89 పాయింట్ల గరిష్టానికి చేరింది. చివరకు 320.70 పాయింట్లు పెరిగి.. 81,633.02 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.15 పాయింట్లు పెరిగి 24,833.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 1,751 షేర్లు లాభపడగా.. 1,748 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎక్స్‌టర్నల్, ట్రెంట్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, విప్రో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐచర్ మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ లాభాల్లో కొనసాగగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్, భారత్ ఎలక్ట్రికల్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్సన్స్, అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పేయింట్స్ తదితర షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ రియాల్టీ 1.2 శాతం పెరిగింది. మెటల్ .08శాతం, ఐటీ, ఫార్మా 0.5శాతం వృద్ధిని నమోదు చేశాయి. పీఎస్‌యూ బ్యాంక్ 0.8శాతం తగ్గింది. ఎఫ్ఎంసీజీ 0.6శాతం పతనమైంది.

## 26 వేల కోట్ల రుణాలు రైటాఫ్..

## బ్యాలెన్స్ షీట్స్ నుంచి తొలగించిన ఎస్బీఐ




### 2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వుబ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరంకానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

## డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్ : ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్.. దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

BASF

# రాయలసీమ అడ్డా..టిడిపి గడ్డ

**దేవుని గడపలో మహానాడు సూపర్ సక్సెస్**
**తాడేపల్లి ప్యాలెస్‌కే జగన్‌ను పరిమితం చేశారు**
**త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**
**రెడ్‌బక్ అంటేనే వణికిపోతున్న నేతలు**

**కడప బహిరంగ సభలో లోకేశ్ ఘాటు వ్యాఖ్యలు**



కడప : దేవుని కడపలో మహానాడు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. తిరుమల తొలి గడప.. దేవుని కడప. దేవుని కడప, ఒంటిమిట్ట, అమీన్‌పీర్ దర్గా ఉన్న పుణ్యభూమి. పౌరుషం, ఆత్మీయత, మహిళలను గౌరవించడం నేర్చుకోవాల్సిన గడ్డ ఇది. మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు జెండా రెప రెపలాడుతోందని అన్నారు. మహానాడు బహిరంగ సభలో తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. 2024లో మాస్ విక్టరీ మనందరం చూశాం. 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రను తిరగరాశాం. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటు దెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు, పార్టీ లేకుండా చేస్తామన్నారు.. కానీ వారే అడ్రస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు.. వారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని నారా లోకేశ్ అన్నారు. 175 నియోజకవర్గాలకు గాను 164 సాధించాం ఇది ఆల్ టైం రికార్డ్ అని పేర్కొన్నారు. జెండా పీకేస్తాం అన్నారు.. ఇప్పుడు వాళ్ళ పార్టీ ఆఫీసుకు టూలెట్ బోర్డు పెట్టారని ఆరోపించారు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేశారు.. ప్రజలు ఇప్పుడు ఫుట్‌బాల్ అడుకునే పరిస్థితి వచ్చింది. ఏ తప్పూ చేయని మన అధినేత చంద్రబాబును జైల్లో పెడితే.. ప్రజలు జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టి లాక్ చేశారు. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు.. ట్రెండ్ సెట్ చేస్తారు. అది సినిమా స్క్రీన్ అయినా..పొలిటికల్ స్క్రీన్ అయినా.. ఆయన ఒక లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, భీముడు, కర్ణుడు అంటూ గంభీరఉపన్యాం ఇచ్చారు. సీబీఎన్ అంటే ప్రజలందరికీ ధైర్యం. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది మన అజెండా. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చింది. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా..పక్క రాష్ట్రానికి పంపారు. ప్రమాదకర మద్యంతో 30వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. గత ప్రభుత్వం మద్యం ద్వారా రూ.వేల కోట్లు లూటీ చేసింది. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కూటమి ఏర్పడింది. ప్రజలు కూటమిని ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.అప్పుడు హైటెక్ సిటీ ఇప్పుడు క్వాంటం హాలీ అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇక, నా పైన కూడా 23 కేసులు పెట్టారు.. తగ్గేదే లేదు అని ఆనాడే చెప్పాం.. విధ్వంసం పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది.. ఒక్క కంపెనీ తీసుకురాక పోగా ఉన్న కంపెనీలను పక్క రాష్ట్రాలకు వెళ్లేలా చేశారు.. జే బ్రాండ్ లిక్కర్ పేరుతో మద్యం కంటే విషం పంచారని ఆరోపించారు. అయితే, పవన్ కళ్యాణ్ నాకు అన్నతో సమానం.. జెండాలు, అజెండాలు పక్కన పెట్టి పవన్ కళ్యాణ్ మన కోసం పని చేశారని చెప్పుకొచ్చారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో ఫ్రీబస్ ను నా అక్కా చెల్లెమ్మలకు కల్పిస్తున్నాం అన్నారు. అలాగే, 16 వేల మందితో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.. గత ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ కూటమి ప్రభుత్వానికి సహకరించారు.. ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఒక పద్ధతి ప్రకారం కూటమి సర్కార్ పరిష్కరిస్తుంది.. 8 లక్షల కోట్ల పెట్టుబడులు ఒప్పందాలు కుదిరాయి, దీని ద్వారా 6 లక్షల ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.అలాగే, వైసీపీ హయాంలో ఇబ్బంది పడ్డ కుటుంబాలను కలుస్తున్నాను అని మంత్రి లోకేష్ తెలిపారు. వైసీపీ కార్యకర్తల్లారా ఏనాడైనా మీ నాయకుడు కలిశారా?.. 25 ఎంపీ స్థానాల్లో కూటమి 21 స్థానాల్లో గెలిచింది.. దీంతో కేంద్ర ప్రభుత్వం మనతో కలిసి పని చేస్తుంది.. మూడు పార్టీలు కలిసి ఉన్నప్పుడు చిన్న చిన్న సమస్యలు సహజం.. మిస్ ఫైర్లు, క్రాస్ ఫైర్లు, విడాకులు ఉండకూడదు.. ఈగోలు వదిలి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. ఇక, తల్లిని చెల్లిని గెంటింది ఎవరు?.. బాబాయినీ చంపింది ఎవరు?.. జే బ్రాండ్ అమ్మి ప్రజల రక్తం పీల్చింది ఎవరు?.. అందరూ రెడ్ బుక్ రెడ్ బుక్ అంటున్నారు.. ఎందుకయ్యా అంత భయం.. రెడ్ బుక్ అనగానే ఒకడికి గుండెపోటు–, ఇంకొకడికి బాత్ రూంలో కాలు విరిగింది, మరొక్కడు ఎక్కడ ఉన్నాడో తెలియదు.. అర్థ మైందా రాజా.. రాయలసీమ గడ్డా టీడీపీ అడ్డా అని నారా లోకేష్ వ్యాఖ్యానించారు.

## యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్

**చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు**

చెన్నై : యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. చెన్నై విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలే సన్నీ యాదవ్ బైక్‌పై పాకిస్థాన్ వెళ్లి వచ్చాడు. దీంతో పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పాకిస్థాన్‌లో ఎవరితోనైనా సంబంధాలు కలిగి ఉన్నాడా? ఎలాంటి గూఢచర్యం చేశాడన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిన జ్యోతి మల్హోత్రాతో సహా పలువురిని జాతీయ దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రా.. పాకిస్థాన్ అధికారులతో చాలా క్లోజ్‌గా తిరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా మంచి సంబంధాలు ఉన్నట్లు–గా గుర్తించారు. ఇక జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన యూట్యూబ్‌లో పాకిస్థాన్‌కు సంబంధించిన అనేక వీడియోలు ఉన్నాయి. ఆమె పాకిస్థాన్‌కు మూడు సార్లు వెళ్లి వచ్చింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడికి ముందు కూడా జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు వెళ్లినట్లు–గా గుర్తించినట్లు– సమాచారం. పహల్గామ్‌కు సంబంధించిన వీడియోలను జ్యోతి మల్హోత్రా.. పాక్ అధికారులకు చేరవేసినట్లు– అనుమానించారు. ప్రస్తుతం ఆమె హర్యానా జైల్లో ఉంది. 9 రోజుల పాటు– ఆమెను దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని హతమార్చారు. అనంతరం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలు నిలిపేసింది. పాక్ వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దును మూసేసింది. అనంతరం మే 7న భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి.

## కడపలో కదం తొక్కిన పసుపు సైన్యం

**బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం**

కడప : కడపలో నిర్వహించిన మహానాడు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. ఆశించిన మేర కన్నా అధిక సంఖ్యలో తరలిరావడతో కడప పరిసరాలు జనసంద్రంగా మారాయి. కడప పట్టణం పసుపు వర్ణంగా మారింది. తెలుగుదేశం జెండా వాహనాలతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. మహానాడుకు సమీప గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, కాలినడకన చేరుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేశారు. మహానాడు ప్రాంగణంలో 3 లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు– చేశారు. కార్యకర్తల కోసం కడప మార్గమధ్యంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు– చేశారు. దారిపొడవునా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతో దాహార్తి తీరుస్తున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రజలు తరలి రాలేదని అభిమానులు చెబుతున్నారు. ప్రజలు భారీగా రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటి సారిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు 140 ఎకరాల సభా ప్రాంగణం మొత్తం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా పసుపు సైన్యం తరలివచ్చింది.

## అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా గండికోట

**78 కోట్ల పర్యాటక శాఖ నిధులను కేటాయించాం**

**గండికోటను సందర్శించిన కేంద్రమంత్రి పెమ్మసాని**

కడప : గండికోటను ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోని గండికోటకు సుమారు 78 కోట్ల పర్యాటక శాఖ నిధులను కేటాయించాం అని తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తో కలిసి పెమ్మసాని గండికోట ప్రాంతాన్ని ఈరోజు పరిశీలించారు. శిథిలమైన నిర్మాణాలను, అద్భుతమైన శిల్పకళ నైపుణ్యాన్ని పరిశీలించిన ఆయన ఈ ప్రాంతాన్ని మరో గ్రాండ్ కెన్యాన్ గా పర్యాటక అభివృద్ధి దిశగా నడిపించాలని అన్నారు. ఇక, శ్రీకృష్ణదేవరాయలు హయాంలో భారతదేశం మొత్తంపై దండయాత్రలు జరిగినా గండికోటను మాత్రం శత్రువులు చేదించలేకపోయారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దాదాపు 200 ఏళ్లకు పైగా మనవాళ్లు ఈ కోటను, విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడారు.. అందులో ప్రధాన పాత్ర పోషించిన చీఫ్ కమాండర్ పెమ్మసాని రామలింగ నాయుడు కవచంలా నిలబడ్డారని గుర్తు చేశారు. 1350వ సంవత్సరం నుంచి 1550వ సంవత్సరం వరకు అనేక మంది ఈ గండికోటను శత్రు దుర్భేధ్య కోటగా నిర్మించడంతో పాటు– పాలించారని వెల్లడించారు. విజయనగర సామ్రాజ్య యుద్ధాలలో మెలకువలు తెలిసిన సైనికులను తయారు చేయడంలోనూ, సైనిక శిక్షణ ఇవ్వడంలోనూ ఈ ప్రాంతం పేరుగాంచింది.. శత్రువులు కోట లోపలకు అడుగు పెట్టడానికి వీలు లేకుండా అప్పట్లోనే అద్భుతమైన ఆర్కి–టె–క్చర్ తో ఈ కట్టడాలు నిర్మించారని పెమ్మసాని పేర్కొన్నారు.

## సొంతవారి కోసమే చంద్రబాబు సంక్షేమం

**పేదలను విస్మరించి సాగిస్తున్న పాలన**

**మీడియా సమావేశంలో మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని**

అమరావతి : సొంతవారికి దోచిపెట్టేందుకే చంద్రబాబు పాలన చేస్తున్నారని, అర్థిక అభివృద్ధి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు తన మనుషులకే మేలు చేస్తున్నారని మాజీ మంత్రి విడదల రజని మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అనేది చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. మహమ్మారి కరోనా సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారని, చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారి పోయాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని ఏం చేయదలచుకున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, జనాలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు అని విడదల రజని నిలదీశారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతులు రోడ్డెక్కారు, పరిశ్రమల ఊసే లేదు. అర్థిక అభివృద్ధి పేరుతో బాబు తన మనుషులకే మేలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అనేది ఆయనకు ఇష్టం లేదు. కరోనా సమయంలో వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ మేలు చేశారు. కానీ చంద్రబాబు పాలనలో ప్రజలకు అలాంటి ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఇప్పుడు ఏదడిగినా పీపీపీ పద్ధతి అంటు–న్నారు. మెడికల్ కాలేజీల ద్వారా ఆరోగ్య సేవలను జగన్ గారు విస్తృత పరిచారు. రాష్ట్ర ప్రజలకు మంచి వైద్యం అందించాలని ఆయన భావించారు. 17 మెడికల్ కాలేజీలను తెచ్చారు. వైద్య విద్య చదివే వారి ఆశలను నిజం చేయాలని జగన్ చూశారు. కార్పొరేట్ స్థాయిలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు– చేయాలని జగన్ భావించారు. నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించటానికి అడుగులేశారు. అలాంటి మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రయివేటీ–కరణ చేస్తున్నారు. ఒక సంస్థతో సర్వే చేయించినట్టుగా కథ నడిపి వారితో రిపోర్టును తెప్పించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో వారికి అనుగుణంగా రిపోర్టు ఇచ్చారు. ఒక్కో కాలేజీని సంవత్సరానికి 5 వేల చొప్పున లీజుకు ఇస్తున్నారు. 5 వందల కోట్ల విలువైన ఆస్తిని 5 వేలకు ఇవ్వటం ఏంటి?' అని మాజీ మంత్రి విడదల రజని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని చంద్రబాబు నాయుడు ఏం చేయదలచుకున్నారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాబు ప్రజలను ఎందుకు ఇలా పట్టి పీడిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవటం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యత నుండి చంద్రబాబు ప్రభుత్వం తప్పుకోవడం సరికాదు. మేము అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై రివ్యూ చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కోసం వైఎస్ జగన్ అనేక ఏర్పాట్లు– చేశారు. ఇప్పుడు వాటిని కూడా ఈ ప్రభుత్వం నాశనం చేసింది. గిరిజనులకు మరలా డోలీల బాధ తప్పటం లేదు' అని విడదల రజని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆదివారాల్లోనూ రేషన్ పంపిణీ

**జూన్ 1 నుంచే అమలుకు నిర్ణయం**

**పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి : జూన్ 1 నుంచి దివారాల్లోనూ రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం అని, రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు. మార్కెట్‌లో ధరల పెరుగుదల ఉంటే.. సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీకి ప్రభుతం అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 29,760 రేషన్ డిపోల ద్వారా ఇచ్చేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు– పూర్తి చేసింది. విజయవాడ మధురానగర్‌లోని 218 రేషన్ షాపులో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ స్వయంగా పరిశీలించారు. ఈపోస్ మిషన్, ఎలక్ట్రానిక్ కాటా పని తీరును దగ్గరుండి మరీ చెక్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తాం. 29,760 షాపుల్లో అన్ని ఏర్పాట్లు– చేశాం. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో మాయ చేసింది. వేల కోట్లు– దుర్వినియోగం అయ్యేలా చేశారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టాం. రైస్ స్మగ్లింగ్ అనేది లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈకేవైసీ 96 శాతం పూర్తి చేశాం.. దేశంలోనే ఇది ఒక రికార్డు. పనులు మానుకుని రేషన్ వ్యాన్ కోసం ఎదురు చూసే విధానానికి స్వస్తి పలికాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల కోసం పని చేస్తున్నాయని చెప్పారు. 'కోటి 46 లక్షల రేషన్ కార్డులు ఏపీలో ఉన్నాయి. జూన్ ఒకటి నుంచి 4.40 లక్షల మందికి సరుకులు ఇస్తున్నాం. మార్కెట్‌లో ధరలు పెరుగుదల ఉంటే సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఇస్తాం. ప్రతి రేషన్ షాపు ఫొటో తీసి యాప్ ద్వారా ఆన్ లైన్లో ఉంచాం. అన్ని షాపులకు ఈ సాయంత్రానికి సరుకులు చేరుతాయి. ఈపోస్ మిషన్, కాటా, సర్వీసింగ్ ఉచితంగా చేయిస్తున్నాం. నేడు రాష్ట్ర వ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించాం. 218 షాపు డీలర్ పసుపులేటి శివప్రసాద్ ముప్పై యేళ్లుగా డీలర్‌గా ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్లకే వెళ్లి సరుకులు అందజేస్తాం. అన్ని విధాలా డీలర్లను కూడా ఇందుకు సన్నద్ధం చేశాం. 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు పని చేస్తాయి. ఎండియూలు పది శాతం డబ్బులు కట్టారు. మిగతా డబ్బు కార్పొరేషన్ ద్వారా కట్టి.. వాహనాలు వారికే ఇస్తున్నాం. ప్రజలు కూడా రేషన్ షాపుల ద్వారానే ఇవ్వాలని కోరుతున్నారు. 15 రోజుల్లో వారికి వీలున్న సమయాల్లో సరుకులు తెచ్చుకుంటారు. 29,760 రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ ఉంటు–ంది. మార్కెట్లో పెరిగే వస్తువులను బట్టి.. రేషన్ షాపుల్లో తక్కువ ధరకే అందిస్తాం. ప్రతి కుటు–ంబానికి ఆహార భద్రత కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం' అని మంత్రి నాదెండ్ల తెలిపారు.

## సిట్ కస్టడీకి లిక్కర్ కేసు నిందితులు

అమరావతి : లిక్కర్ స్కామ్‌లో నిందితులను సిట్ కస్టడీకి అప్పగించాలన్న సిట్ వినతిని ఎసిబి కోర్టు అనుమతించింది. కస్టడీ కోసం ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని మూడు రోజులు.. అలాగే ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను వారం రోజులపాటు– తమ కస్టడీకి అప్పగించాలంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై వాదనలు పూర్తికావడంతో ఏసీబీ కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. నలుగురు నిందితులను రెండ్రోజులపాటు– కస్టడీకి అనుమతించింది. ఈనెల 30, 31 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకూ విచారించేందుకు సిట్ అధికారులకు అనుమతించింది. కాగా, ఏపీ లిక్కర్ స్కాంపై పూర్తిగా దర్యాప్తు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు– చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అతడు చెప్పిన వివరాలు ఆధారంగా విశ్రాంతి ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలతోపాటు– బాలాజీ గోవిందప్పను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అయితే, వీరిని తమ విచారణకు అప్పగించాలంటూ సిట్ అధికారులు ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని సిట్ అధికారులు ఒకసారి కస్టడీకి తీసుకుని విచారించారు. మరోసారి అతడిని కస్టడీకి అప్పగించాలంటూ సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో రెండ్రోజుల కస్టడీకి అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## బనకచర్లతో రాయసీమకు మహర్దశ

**సీమ అభివృద్ధికి ఇక అడ్డు ఉండనే ఉండదు**

**కడప బహిరంగ సభలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి**

కడప : మనకు కేవలం నదులపై ఆనకట్టలు కనిపిస్తే.. చంద్రబాబుకు మాత్రం నదుల అనుంధానం గుర్తొస్తుందని, నిజమైన విజినరీ అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. దానికి కార్యరూపమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి.. కృష్ణా జలాలను బనకచర్ల రిజర్వాయర్ వరకు తీసుకొస్తే.. రాయలసీమ అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ ఉండదని మాధవి రెడ్డి అన్నారు. కడప సభలో ఆమె మాట్లాడుతూ..తెలుగువాడి ఆత్మగౌరవ అగ్నిజ్వాలను నాటి ఢిల్లీ పాలకులకు తెలియజేయడం కోసం పుట్టిన పార్టీయే తెదేపా అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టి 9 నెలల్లోనే అధికారం చేపట్టి సత్తా చాటారని అన్నారు. అలాంటి పార్టీ బడుగు,బలహీనవర్గాలకు అండగా ఉంటోందని అన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి, రాజకీయ స్వాతంత్ర్యం కోసమే ఈ పార్టీ పుట్టిందన్నారు. మహానాడులో ఆమె మాట్లాడుతూ.. 43 ఏళ్ల తెదేపా చరిత్రలో తొలిసారిగా కడపలో మహానాడు నిర్వహించుకుంటున్నందుకు అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ పార్టీకి క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. రాష్ట్రంలో మొట్టమొదటిసారి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే.. వాటిని రూ. 4 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడిదని అన్నారు. రాయలసీమ కోసం ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును నిర్మిస్తే.. ఎస్ఆర్‌బీసీ, హెచ్ఎన్ఎస్, సీఎన్ఎస్ఎస్, కేసీ కెనాల్‌లను అభివృద్ధి చేసిన చంద్రబాబు.. లక్షలాది మంది రాయలసీమ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూనే.. పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిలో పలు సంస్కరణలను తీసుకొచ్చారని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠిత దీక్ష, నేర్పు, ఓర్పు కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోందన్నారు.

## మారు వేషంలో కలెక్టర్ పర్యటన

**గుంతకల్ల ఆస్పత్రి పరిశీలించి ఆరా**

అనంతపురం : అనంత జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ మారువేషంలో జిల్లాలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన ఈ పని చేశారు. ప్రజాసేవకు నూతన మార్గంగా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలతో.. అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా, కలెక్టర్ వినోద్ కుమార్ మారువేషంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి తనిఖీలు చేశారు. అయితే, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సామాన్యుడిలా గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలియతిరుగుతూ.. రోగుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖానికి మాస్క్, మెడలో టవల్ కప్పుకుని ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్నీ పరిశీలించారు. ఆసుపత్రి బయట చెప్పులు విడిచి వెళ్లి.. రోగులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని కలెక్టర్ వినోద్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## మీరెడ్ బుక్ బెదిరింపులు భయపడేది లేదు

**రాష్ట్రానికి ఏం చేశారో చెప్పండి చూద్దాం**

**టిడిపికి గడికోట్ శ్రీకాంత్ సవాల్**


కడప : చంద్రబాబు పదహారేళ్ళ పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ తెచ్చారా అని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. మీ హయంలోనే ఫ్యాక్షన్ క్రియేట్ చేశారు.. రాయలసీమలో వైఎస్ఆర్ ఫ్యాక్షన్ అరికట్టేందుకు కొత్త నేతలను తీసుకు వచ్చారు.. మీ దుష్ట శక్తుల సాయంతో జగన్ ను ఓడించినంత మాత్రాన మీరు సాధించింది ఏమీ లేదన్నారు. ప్రజలకు మంచి చేయటం అంటే వైఎస్సార్, ఎన్టీఆర్ లాంటి నేతలు గుర్తుకు రావాలి.. కడపలో మహానాడు అనగానే జిల్లాకు ఉన్న పేరును కూడా మార్చిన చంద్రబాబు.. మీకు బుద్ధి చెప్పే రోజు వస్తుంది.. మీరు కడపలో సక్సెస్ అవ్వాలంటే మీరు ఇచ్చిన హామీలు అమలు చేస్తేనే అవుతారు.. మీ హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేయటం తప్ప మీరు చేసేదేమీ లేదు.. జగన్ ప్రజానాయకుడు.. ఆయన ఎక్కడకు వెళ్ళినా తండోపతండాలుగా జనం వస్తారు.. ఫైనల్ గా కడప మహానాడు ఫెయిల్.. మీ రెడ్ బుక్ చూసి ఎవరూ భయపడటం లేదు అని గడికొట శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. కడప నేతలు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి.. కడప జిల్లా సహా రాష్ట్రానికి ఎవరి హయాంలో మంచి జరిగిందో ఆలోచన చేయాలి అన్నారు. వ్యవసాయం దండగ అని పుస్తకంలో రాసుకున్నది ఎవరు.. పోలవరాన్ని ఈ దశకు తెచ్చిందెవరు.. శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు నిలుపుకునే ఆలోచన చేయరు.. ఏపీలో జలయజ్ఞం కింద వైఎస్సార్ ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారో అందరికీ తెలుసు.. ఈ ఏడాదిలో ఎన్ని రాజకీయ హత్యలు జరిగాయని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, మేలు చేయాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబే వైసీపీ వాళ్లకు పనులు చేయొద్దు టీ–డీపీ వాళ్ళకే పనులు చేయాలని పిలుపు ఇచ్చారు అని గడికొట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. వైసీపీ వాళ్లను ఆఫీస్ కి రావొద్దంటారా.. వైసీపీ వాళ్లంటే ఏమనుకుంటారు.. ఇవాళ నరేంద్ర మోడీని పొగుడుతున్న చంద్రబాబు ఐదేళ్ల క్రితం ఆయనను ఎలా తిట్టారో అందరూ చూశారు.. అంత ధైర్యం ఉంటే ఒంటరిగా పోటీ– చేయటానికి ఎందుకు భయపడ్డారు అని అడిగారు. ఎన్టీఆర్, చంద్రబాబును పొగిడినట్లు– ఏఐ వీడియోలు తయారు చేయించి చూపిస్తున్నారు.. అదే ఎన్టీఆర్ చనిఎపోయే ముందు చంద్రబాబు గురించి మాట్లాడిన మాటలు కూడా వేయాలి కదా అన్నారు. మీరు రాష్ట్రానికి ఏ ప్రాంతానికి మేలు చేశారు.. మీ పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకం గురించి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇక, మాట్లాడితే నేను హైదరాబాద్ నిర్మించా అంటారు.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వైసీపీ నేత గడికొట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి.. వైసీపీ కోవర్టులు టీడీపీలోకి వెళ్ళి హత్యలు చేస్తున్నారు అంటున్నారు.. ఇంతకన్నా దుర్మార్గం ఉంటుందా..అని ప్రశ్నించారు.



# మహేశ్ ఖలేజా నేడు రీ రిలీజ్

## నష్టాలను పూడ్చుకుంటామన్న నిర్మాత కళ్యాణ్

మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఖలేజా ఒకటి. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీ రిలీజ్ కానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా దీనిని రీ రిలీజ్ చేస్తున్నారు. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెఫరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీ రిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది. ఖలేజా రీ రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టంట వైరల్ అవుతున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు. బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీ రిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# హోంబలే ఫలిమ్స్‌తో హృత్రిక్ రోషన్ జోడీ

## అధికారికంగా ప్రకటించిన చిత్ర నిర్మాణ సంస్థ

కేజీఎఫ్, కాంతార, సలార్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో అగ్ర నిర్మాణ సంస్థగా ఎదిగిన హోంబాలే ఫిలిమ్స్, బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో కలిసి ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కలయికపై సినీ వర్గాలతో పాటు- ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. హోంబాలే ఫిలిమ్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడిస్తూ, హృతిక్ రోషన్‌కు ఘనంగా స్వాగతం పలికింది. అతడిని గ్రీక్ గాడ్ అని పిలుస్తారు. అతను హృదయాలను పరిపాలించాడు, పరిమితులను బద్దలు కొట్టాడు. నిజంగానే ఆయన ఒక అద్భుతం! హృతిక్ రోషన్‌ను హోంబాలే కుటుంబానికి స్వాగతించడానికి మేము గర్విస్తున్నాము. ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ కలయిక, ధైర్యం, గొప్పదనం, కీర్తి కథను విప్పబోతోంది. ఇంటెన్సిటీ ఊహలను కలిసే చోట, బిగ్ బ్యాంగ్ ప్రారంభమవుతుందని ఆసక్తికరమైన క్యాప్షన్‌ను పోస్ట్ చేసింది. హృతిక్ రోషన్ కూడా ఈ భాగస్వామ్యం పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. హోంబాలే ఫిలిమ్స్ ఎల్లప్పుడూ ప్రత్యేకమైన కథలకు నిలయమని, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభవాన్ని అందించడానికి తాను ఎదురుచూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతానికి, ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. దర్శకుడు, ఇతర నటీ-నటు-లు, సాంకేతిక నిపుణుల వివరాలను నిర్మాణ సంస్థ ఇంకా ప్రకటించలేదు. అయితే, ఈ చిత్రం పాన్ ఇండియా సినిమాగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది. హృతిక్ రోషన్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ తో కలిసి 'వార్ 2' సినిమాలో నటిస్తున్నారు. మరోవైపు, హోంబాలే ఫిలిమ్స్ కూడా 'కాంతార: చాప్టర్ 1', ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న 'డ్రాగన్' వంటి ప్రతిష్టాత్మక చిత్రాలతో బిజీగా ఉంది. ఈ కొత్త ప్రాజెక్ట్ భారతీయ సినిమా పరిశ్రమలో కొత్త సంచలనం సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# గద్దర్ అవార్డులతో చిత్ర సంస్థల అభినందనలు

## అవార్డులు దక్కినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

తెలంగాణ ప్రభుత్వానికి టాలీవుడ్ నిర్మాణసంస్థలు కృతజ్ఞతలు తెలిపాయి. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం గద్దర్ అవార్డును ప్రకటించింది. ఇందులో పలు సినిమాలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా నిర్మాణసంస్థలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్ట్‌లు పెట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి దర్శక, నిర్మాతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ అవార్డుల్లో లక్కీ భాస్కర్ సినిమా హవా చూపింది. ఏకంగా నాలుగు అవార్డులను (ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటర్) సొంతం చేసుకుంది. ఇది టీమ్‌కు ఎంతో గర్వకారణమని నిర్మాణసంస్థ పేర్కొంది. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పింది. అలాగే తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' అవార్డును సొంతం చేసుకుంది. దీనిపై నిర్మాణసంస్థ వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. చిత్ర బృందాన్ని ప్రోత్సహించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఉత్తమ పరిచయ దర్శకుడిగా 'కమిటీ- కుర్రాళ్లు'కు గాను యధువంశీ అవార్డును సొంతం చేసుకున్నారు. వంశీకి అవార్డు ఇచ్చినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెబుతూ నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్ పోస్ట్ పెట్టింది. 'కమిటీ- కుర్రాళ్లు టీమ్‌కు ఇదో ఒక మైలురాయి. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మా కృతజ్ఞతలు. మా శ్రమను గుర్తించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు. ఈ గుర్తింపు మా గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొంది. ఇక 'ఆయ్' సినిమా ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా నిలిచింది. దీంతో చిత్రబృందం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొంది.




# ఉత్తమ చిత్రంగా కల్కి మూవీ

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్
## ఉత్తమ నటిగా నివేదా థామస్
## ఉత్తమ గాయనిగా శ్రేయా ఘోషాల్
## అవార్డుల వివరాలు ప్రకటించి జయసుధ, దిల్‌రాజ్

హైదరాబాద్,మే29(ఆర్‌ఎన్‌ఎ): గద్దర్ అవార్డుల విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమగాయనిగా శ్రేయా ఘోషల్ ఎంపికలయ్యరు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ మీడియా సమావేశంలో 2024కు సంబంధించిన అవార్డులను ప్రకటించారు. మొత్తం 1248 నామినేషన్లను పరిశీలించిన కమిటీ-.. విజేతలను ఎంపిక చేసింది. తెలంగాణ యుద్ధ నౌక, దివంగత ఉద్యమ నేత గద్దర్ పేరు మీద.. సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిసారి గద్దర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ చిత్రంగా కల్కి సినిమాను కమిటీ ఎంపిక చేసింది. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో సినీ అవార్డుల జూరి ఏర్పాటు- అయ్యింది. ఈ క్రమంలో గురువారం ఉదయం గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల వివరాలను అవార్డుల కమిటీ- చైర్మన్ జయసుధ ప్రకటించారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవార్డులను ఇవ్వబోతోందని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా పారదర్శకంగా అవార్డులను ఎంపిక చేశామని జయసుధ చెప్పారు. అవార్డులు తమకు బూస్ట్ ఇస్తాయని.. ప్రభుత్వం తమకు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భట్టి విక్రమార్క , కోమటిరెడ్డి , దిల్ రాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. 14 ఏళ్ల అనంతరం అవార్డులు ఇవ్వటం సంతోషమన్నారు. బెస్ట్ ఆఫ్ బెస్ట్ కే అవార్డులు వస్తున్నాయని అన్నారు. జూన్ 14న హైటెక్స్‌లో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. అలాగే 2014-23 సంవత్సరాలకు సంబంధించిన అవార్డులను త్వరలో ప్రకటిస్తామన్న జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు.

గద్దర్ అవార్డులు దక్కిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఉత్తమ చిత్రం - కల్కి
ఉత్తమ రెండో చిత్రం - పొట్టేల్
ఉత్తమ మూడో చిత్రం - లక్కీభాస్కర్
ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప-2)
ఉత్తమ నటి - నివేదా థామస్ (35 చిన్న కథకాదు)
ఉత్తమ డైరెక్టర్ - నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు - ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి - శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్)
ఉత్తమ హాస్యనటుడు - సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా)
ఉత్తమ సంగీత దర్శకుడు - బీమ్స్ (రజాకార్)
ఉత్తమ స్టోరీ రైటర్ - శివ పాలడుగు
ఉత్తమ స్క్రీన్ ప్లే - వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గాయకుడు - సిద్ద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకో)
ఉత్తమ గాయని - శ్రేయా ఘోషల్ (పుష్ప-2)
ఉత్తమ కొరియోగ్రాఫర్ - గణేష్ ఆచార్య (దేవ)
స్పెషల్ జ్యూరీ అవార్డు - దుల్కర్ సల్మాన్ (లక్కీభాస్కర్)
స్పెషల్ జ్యూరీ అవార్డు - అనన్య నాగళ్ల (పొట్టేల్)
బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్ - యధువంశీ (కమిటీ- కుర్రాళ్లు)
2024 ఉత్తమ బాలల చిత్రం - 35 చిన్న కథకాదు
బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ - హెరిటేజ్-హిస్టరీ విభాగం - రజాకార్
నేషనల్ ఇంటెగ్రిటీ- సోషల్ అప్‌లిఫ్ట్ విభాగం - కమిటీ- కుర్రాళ్లు






Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com